

## ప్రభుత్వ పాఠశాలల్లో ఇక క్రాస్ వాల్యుయేషన్

- ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయించే క్రాస్ వాల్యుయేషన్ విధానాన్ని అమలు చేయనున్నారు.


వాస్తవాలు పలుకు DD9 వార్త

TE TL/26/A2635

తెలుగు దినపత్రిక








హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:108 | 31-08-2026 సోమవారం | పేజీలు: 08 | వెల 3/-


## రియల్‌ఎస్టేట్ సంస్థగా కాంగ్రెస్ ప్రభుత్వం

- రూ.500 కోట్ల విలువైన భూమిని రూ.87 కోట్లకే ప్రైవేటు వ్యక్తికి అప్పగించే యత్నం
- ఆయిల్‌ఫెడ్‌కు భూమి దక్కకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- 1987 సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శ
- ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత సర్కారుపై ఉందని వ్యాఖ్య
- నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే న్యాయ, ప్రజా పోరాటం



**హైదరాబాద్, ఆగస్టు 30:** నగరం నడిబొడ్డున ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రియల్‌ఎస్టేట్ సంస్థగా మారిపోయిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ సమాజ సంక్షేమాన్ని పక్కనబెట్టి కమీషన్ల కోసం వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కారు చౌకగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. అజామాబాద్ భూముల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సుదీర్ఘ బహిరంగ లేఖ రాశారు.


మిగతా 2వ పేజీలో..


## వెయ్యి రోజుల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ

- కుటుంబ పాలనకు ముగింపు..
- ప్రజలకు చేరువైన పాలన ప్రజావాణి, గ్రామసభలతో ప్రజల ముంగిటకు ప్రభుత్వం 3.42 కోట్ల మందికి ఉచిత సన్నబియ్యం పంపిణీ
- కులగణన, ఎస్సీ వర్గీకరణలో ముందడుగు అప్పుల భారంలోనూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం


2






# ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్.. ఆన్‌గ్రౌండ్‌లో రేవంత్

- డిజిటల్ ప్రచారంలో దూసుకెళ్తున్న ప్రతిపక్షం
- ప్రజల్లోకి వెళ్లడానికే సీఎం ప్రాధాన్యం
- మాస్ డైలాగ్స్‌తో రాజకీయ వేడి
- గ్రామీణ ఓటర్లపై ప్రత్యక్ష ప్రభావం
- డిజిటల్ బలహీనతను పర్యటనలతో భర్తీ చేసే యత్నం

**హైదరాబాద్, ఆగస్టు 30:** తెలంగాణ రాజకీయాల్లో ప్రచార పోరు కొత్త రూపు సంతరించుకుంటోంది. బీఆర్ఎస్ డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని ప్రభుత్వంపై విమర్శలను విస్తృతంగా ప్రచారం చేస్తుండగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం క్షేత్రస్థాయి రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కంటే ప్రజలను నేరుగా కలవడం, బహిరంగ సభలు, జిల్లాల పర్యటనల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడంపైనే దృష్టి సారిస్తున్నారు.

**డిజిటల్‌లో కాంగ్రెస్ వెనుకంజ**

తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఉన్నంత బలమైన సామాజిక మాధ్యమ వ్యవస్థ కాంగ్రెస్‌కు లేకపోవడం రాజకీయంగా ప్రతికూలంగా మారుతోంది. గత పదేళ్లలో బీఆర్ఎస్ నిర్మించుకున్న డిజిటల్ నెట్‌వర్క్ ద్వారా ప్రభుత్వంపై విమర్శలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం కొనసాగుతోంది. దీనికి సమర్థంగా దీటైన ప్రచార వ్యవస్థను కాంగ్రెస్ ఇంకా నిర్మించుకోవాల్సి ఉంది. ఈ లోటును రేవంత్ రెడ్డి తన పర్యటనలు, బహిరంగ సభలతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. తరచూ జిల్లాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలవడం ద్వారా ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలో మద్దతు పెంచుకోవాలని భావిస్తున్నారు.

**మాస్ ప్రసంగాలతో రాజకీయ వేడి**

రేవంత్ రెడ్డి ప్రసంగాలు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కావడం లేదు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు, ఘాటు వ్యాఖ్యలతో రాజకీయ


మిగతా 2వ పేజీలో..


## మూసారాంబాగ్ బ్రిడ్జి పూర్తి

- రూ.52 కోట్లతో 400 మీటర్ల పొడవున వంతెన నిర్మాణం
- 14.5 మీటర్ల వెడల్పుతో వంతెన.. 3.5 మీటర్ల ఫుట్‌పాత్
- అంబర్‌పేట్–మూసారాంబాగ్ మధ్య ఏడాది పొడవునా రాకపోకలు
- వర్షాకాలంలో ముంపు, రాకపోకల అంతరాయాలకు శాశ్వత పరిష్కారం
- ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కర్ణన్ ఆదేశం




2


## తెలంగాణలో గోదావరి పుష్కరాల నిర్వహణకు సన్నాహాలు

- గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ గుర్తొచ్చేలా ఏర్పాట్లు
- జూన్ 26 నుంచి జులై 7 వరకు పుష్కరాలు
- ఏర్పాట్లకు రూ.1,000 కోట్లు మంజూరు
- భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం
- శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక అధికారి కార్యాలయం




3




## వన మహోత్సవం.. ప్రజా ఉద్యమంగా మారాలి

- మొక్కలు నాటడంతో బాధ్యత తీరదు.. సంరక్షణ కీలకం
- 6.18 కోట్ల మొక్కల నాటడమే లక్ష్యం
- ఇప్పటికే 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు వెల్లడి
- గుంతల తవ్వకంలో 92 శాతం.. నాటడంలో 91 శాతం పురోగతి
- 2.75 కోట్ల పండ్ల మొక్కల పంపిణీకి ప్రణాళిక


2




## ఆర్ఎస్ఎస్‌పై ఒవైసీ ఘాటు విమర్శలు

- ముస్లింలపై తియ్యటి మాటలు చెప్పడం మానండి
- ఆర్ఎస్ఎస్ పాత సిద్ధాంతాలను ప్రజలకు చెప్పాలి
- గోల్వాల్కర్ రచనలను ప్రస్తావిస్తూ విమర్శలు
- మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపణ


2


## కులగణనలో ప్రతి కులానికి యూనిక్ కోడ్

- దేశవ్యాప్తంగా కులగణనను తప్పనిసరి చేయాలని డిమాండ్
- ప్రతి కులానికి ప్రత్యేక కోడ్‌తోనే జనగణన చేపట్టాలి
- ఓబీసీలు, జనరల్ వర్గాలకు ప్రత్యేక కాలమ్‌లు ఏర్పాటు చేయాలి
- శాస్త్రీయ విధానం లేకుంటే రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా
- డిమాండ్లు పట్టించుకోకుంటే దేశవ్యాప్త ఉద్యమం


2







## నేపాల్‌లో తెలంగాణవారి కోసం సమన్వయం

- వరద బాధితుల ఆచూకీ కోసం కేంద్రంతో తెలంగాణ భవన్ నిరంతర సంప్రదింపులు
- సురక్షిత తరలింపు, పాస్‌పోర్ట్ సమస్యల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి
- టిబెట్ నుంచి నేపాల్ మీదుగా భారతీయుల తరలింపు
- తెలంగాణకు చెందిన అల్లి విజయలక్ష్మి హైదరాబాద్‌కు చేరుకునే అవకాశం
- డీఎన్ఏ కోసం కుటుంబ సభ్యులు నేపాల్ వెళ్లాల్సిన అవసరం లేదని వెల్లడి


3




## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ


2

## ఆర్ఎస్ఎస్‌పై ఒవైసీ
# ఘాటు విమర్శలు

**హైదరాబాద్, ఆగస్టు 30:**
భారత్‌లో ముస్లింలు ఉండకూడదని భావించే వారు హిందువులు కాదంటూ న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఆర్ఎస్ఎస్‌కు ప్రపంచం ముందు ఒకలా, తమ కార్యకర్తలకు మరోలా మాట్లాడటం పాత వ్యూహమని ఆరోపిస్తూ ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు.

**పాత సిద్ధాంతాలేంటని ప్రశ్న**
ఆర్ఎస్ఎస్ భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని ఒవైసీ పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ గాంధీజీ నాయకత్వంలోని హిందూముస్లిం ఐక్యతను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారని, ఆ విషయాన్ని ఆర్ఎస్ఎస్ ప్రచురించిన ఆయన జీవిత చరిత్రలోనే పేర్కొన్నారని తెలిపారు.

**గోల్వాల్కర్ రచనలను ప్రస్తావిస్తూ**
ఆర్ఎస్ఎస్ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని ఒవైసీ ఆరోపించారు. 1940లో ఎం.ఎస్. గోల్వాల్కర్ ఒకే జెండా, ఒకే నాయకుడు, ఒకే సిద్ధాంతం గురించి పేర్కొన్నారని తెలిపారు. గోల్వాల్కర్ రచించిన 'బంచ్ ఆఫ్ థాట్స్'లోని 'ఇంటర్నల్ త్రెట్స్' అధ్యాయాన్ని ప్రస్తావిస్తూ ముస్లింలు, క్రైస్తవులను దేశానికి ముప్పులుగా పేర్కొన్నారని విమర్శించారు.

**తియ్యటి మాటలు మానాలని డిమాండ్**
ఉమ్మడి పౌరస్మృతి, మతమార్పిడి నిరోధక చట్టాలు, యూఏపీఏ వంటి అంశాలను ప్రస్తావిస్తూ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఒవైసీ ఆరోపించారు. 2002 గుజరాత్ అల్లర్లలో ముస్లింలపై జరిగిన హింసను కూడా ప్రస్తావించారు. భగవత్ బయటకు తియ్యటి మాటలు చెప్పడం మానుకుని హెడ్గేవార్, గోల్వాల్కర్, సావర్కర్ రచనల్లోని అంశాలను ప్రజలకు బహిరంగంగా చదివి వినిపించాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ అసలు సిద్ధాంతాన్ని ప్రజలు అప్పుడే అర్థం చేసుకుంటారని వ్యాఖ్యానించారు.




## కులగణనలో ప్రతి కులానికి
# యూనిక్ కోడ్

**హైదరాబాద్, ఆగస్టు 30 :**
దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో కులగణనను తప్పనిసరి చేయడంతో పాటు ప్రతి కులానికి ప్రత్యేకంగా యూనిక్ కోడ్ కేటాయించాలని పలువురు మేధావులు, రాజకీయ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్త ఏకాభిప్రాయం వచ్చే వరకు జనగణన ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం 'జనగణనలో కులగణన-ప్రతి కులానికి యూనిక్ కోడ్' ప్రధాన డిమాండ్‌తో ఓబీసీ జాతీయ సదస్సు నిర్వహించారు. బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ టి. చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. కిరణ్ కుమార్ అధ్యక్షతన సదస్సు జరిగింది.

**ప్రత్యేక కోడ్‌తోనే గణన**
ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించకుండా కులగణన నిర్వహించడం శాస్త్రీయ విధానం కాదని సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల తరహాలో ఓబీసీలు, జనరల్ వర్గాలకు కూడా ప్రత్యేక కాలమ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
డ్రాప్‌డౌన్ మెనూ ద్వారా ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన ప్రక్రియను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**సదస్సుకు పలువురు నేతలు**
రాజ్యసభ ఎంపీ విల్సన్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఏఐసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ అనిల్ జైహింద్, స్వరాజ్ ఇండియా నేత ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ రతన్ లాల్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్ గౌడ్, ఎస్. దుర్గయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా**
శాస్త్రీయ ప్రణాళిక లేకుండా జనగణన చేపడితే కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న సుమారు రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా అయ్యే అవకాశం ఉందని ప్రొఫెసర్ సూరజ్ మండల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ఎంపీ విల్సన్ హెచ్చరించారు.
ప్రతి కులాన్ని కచ్చితంగా నమోదు చేసేలా పారదర్శక, శాస్త్రీయ విధానాన్ని కేంద్రం తక్షణమే అమలు చేయాలని కోరారు. తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ముందుకు వెళ్తే దేశవ్యాప్తంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

# మూసారాంబాగ్ బ్రిడ్జి పూర్తి

**హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:**
చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 2022లో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. రూ.52 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో 400 మీటర్ల పొడవైన వంతెనను నిర్మించారు. 14.5 మీటర్ల వెడల్పుతో నిర్మించిన వంతెనపై పాదచారుల కోసం 3.5 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్ ఏర్పాటు చేశారు.

**ఏడాది పొడవునా రాకపోకలు**
వంతెన అందుబాటులోకి రావడంతో అంబర్‌పేట్-మూసారాంబాగ్ మధ్య అన్ని కాలాల్లో రాకపోకలకు అవకాశం కలగనుంది. ముఖ్యంగా వర్షాకాలంలో మూసీ నదికి వరదలు వచ్చినప్పుడు ఏర్పడే నీటి ముంపు, రాకపోకల అంతరాయాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. రెండు ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు సురక్షితమైన, నిరంతరాయ ప్రయాణం అందుబాటులోకి రానుంది.

**కమిషనర్ కర్ణన్ సమీక్ష**
మూసారాంబాగ్ వంతెనతో పాటు నల్లొండ ఫ్లైఓవర్ పనులను జీహెచ్ఎంసీ కమిషనర్



ఆర్వీ. కర్ణన్ ఆదివారం తనిఖీ చేశారు. రెండు ప్రాజెక్టుల పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూసారాంబాగ్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**చంచల్‌గూడ ఫ్లైఓవర్ పనులు**
చంచల్‌గూడ ఫ్లైఓవర్ ప్రధాన నిర్మాణం పూర్తయిందని కమిషనర్ తెలిపారు. ప్రారంభోత్సవానికి మార్గం సుగమం చేసేలా ఏ4 అప్ ర్యాంప్ పనులను ఆదివారమే పూర్తి చేయాలని ఆదేశించారు. చంపాపేట్ వైపు వెళ్లే ఏ3 సైడ్ ర్యాంప్ పనులను రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే చంచల్‌గూడ, సైదాబాద్, సంతోష్‌నగర్, ఐఎస్ సదన్, ఒవైసీ ఆస్పత్రి, కంచన్‌బాగ్, చంపాపేట్, సాగర్ రోడ్ మార్గాల్లో ప్రయాణించే వారికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందని కర్ణన్ తెలిపారు.

# వెయ్యి రోజుల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ

**హైదరాబాద్, ఆగస్టు 30:**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం రాష్ట్ర ప్రస్థానంలో కీలక మైలురాయని రాష్ట్ర మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ వెయ్యి రోజుల్లో ప్రభుత్వం మారడమే కాకుండా తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య స్ఫూర్తి పునరుద్ధరించబడిందని పేర్కొన్నారు.
ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధికారం ఒక వ్యక్తి, ఒక కుటుంబం చేతుల్లో కేంద్రీకృతమైందని ఆరోపించారు.

**ప్రజలకు చేరువైన పాలన**
మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, సామాన్య ప్రజల గొంతుకకు కూడా గత పాలనలో విలువ లేకుండా పోయిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సచివాలయాన్ని ప్రజలకు దూరం చేసి, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిరంకుశ సంస్కృతికి ముగింపు పలికిందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటోందని, మంత్రులు ప్రజల మధ్యకు వెళ్తున్నారని, శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.
ప్రజావాణి, గ్రామసభలు, ప్రత్యక్ష ప్రజా సంప్రదింపుల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చామని పేర్కొన్నారు.

**సంక్షేమానికి పెద్దపీట**
ప్రజాస్వామ్య పునరుద్ధరణతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పౌర సరఫరాల రంగంలో కీలక సంస్కరణలు చేపట్టామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.42 కోట్ల మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హులైన లక్షలాది కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, ఆధునిక స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించామని తెలిపారు. రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు,



వ్యవసాయ కూలీలు, బలహీనవర్గాలను ప్రభుత్వ విధానాలకు కేంద్రబిందువుగా మార్చామని పేర్కొన్నారు.

**సామాజిక న్యాయమే లక్ష్యం**
సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి తెలిపారు. సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణలో సాధించిన పురోగతి సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిగిల్చిన భారీ అప్పులు, బడ్జెట్ వెలుపలి రుణాలు, పెండింగ్ బకాయిలు, అసంపూర్తి ప్రాజెక్టులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడిలో ఉందని తెలిపారు.
అయినప్పటికీ భారీ రుణాలు, వడ్డీలు చెల్లిస్తూ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు అభివృద్ధికి పెట్టుబడులను పెంచామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

**కుటుంబ పాలనకు ముగింపు**
బీఆర్ఎస్‌కు ఆందోళనలు చేసే స్వేచ్ఛ ఉండటమే తెలంగాణలో ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడిందనడానికి నిదర్శనమని మంత్రి అన్నారు. అయితే తమ వెయ్యి రోజుల ప్రభుత్వ విజయాలను ప్రతిపక్షాలు చెరిపివేయలేవని స్పష్టం చేశారు. కుటుంబ పాలన నుంచి ప్రజా పాలన వైపు తెలంగాణ నిర్ణయాత్మకంగా అడుగులు వేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# వన మహోత్సవం.. ప్రజా ఉద్యమంగా మారాలి

**హైదరాబాద్, ఆగస్టు 30:**
వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా పచ్చని, ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి ప్రజా ఉద్యమంగా మలచాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు.
ఆదివారం ప్రజాభవన్‌లో కమిషనర్ దివ్య దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మితో కలిసి వన మహోత్సవం పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు.
జిల్లాల వారీగా మొక్కల పంపిణీ, గుంతల తవ్వకం, మొక్కల మనుగడ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**లక్ష్యానికి చేరువగా**
ఈ ఏడాది 6.18 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు అధికారులు మంత్రికి వివరించారు.
గుంతల తవ్వకంలో 92 శాతం, మొక్కలు నాటడంలో 91 శాతం పురోగతి సాధించినట్లు



తెలిపారు. అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన సీతక్క.. వాతావరణం అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో మిగిలిన లక్ష్యాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**మొక్కల సంరక్షణే ముఖ్యం**
మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని మంత్రి స్పష్టం చేశారు. వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించినప్పుడే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.
నాటిన ప్రతి మొక్క మనుగడ సాధించేలా గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

**కుటుంబ ఆరోగ్యానికి పండ్ల మొక్కలు**
పండ్ల కోసం మార్కెట్లపైనే ఆధారపడకుండా ఇంటి ఆవరణలోనే పండ్ల మొక్కలను పెంచుకోవడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సీతక్క సూచించారు.
మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు స్వచ్ఛమైన పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది 2.75 కోట్ల పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.
జామ, ఉసిరి, మామిడి, సీతాఫలం, మునగ వంటి మొక్కలను ఇళ్ల వద్ద పెంచుకోవడం ద్వారా స్వచ్ఛమైన గాలితో పాటు పోషకాహారం కూడా లభిస్తుందని తెలిపారు.
పంపిణీ చేసిన మొక్కలు వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. ప్రతి మొక్కను ఇంటి సభ్యుడిలా ప్రేమగా పెంచుకుంటూ పచ్చని గ్రామాలకు, ఆరోగ్యకరమైన సమాజానికి ప్రజలంతా బలమైన పునాది వేయాలని మంత్రి సీతక్క కోరారు.

## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ

**హైదరాబాద్, ఆగస్టు 30 :**
తెలంగాణ శాసనసభ, శాసన మండలి వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ఉభయ సభల సమావేశాలు ప్రారంభం కానున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి అధికారిక సర్కులర్ జారీ చేశారు.
సెప్టెంబర్ 7న ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయని అధికారులు సభ్యులకు సమాచారం అందించారు.

**సీఎం ముందే ప్రకటన**
వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబర్‌లో నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ కార్యదర్శి సమావేశాల ప్రారంభ తేదీని అధికారికంగా వెల్లడించారు.

**బీఆర్ఎస్ పాలనపై చర్చకు సవాల్**
గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై సభలో విస్తృతంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.
ఈ చర్చలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అసెంబ్లీకి వచ్చి పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు.

**పలు అంశాలపై చర్చ**
ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలు సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది.
రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలు, వివిధ సామాజిక అంశాల నేపథ్యంలో సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలు కీలకంగా మారనున్నాయి.
సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడిగా చర్చలు జరిగే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



## ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్..
# ఆన్‌గ్రౌండ్‌లో రేవంత్

**మొదటిపేజీ తరువాయి**
వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు క్షుద్ర పూజలు చేయిస్తున్నారంటూ చేసిన ఆరోపణలు, సొంత పార్టీ నేతలపైనే తీవ్రంగా వ్యవహరిస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.
ఇలాంటి వ్యాఖ్యలు ప్రసంగ వేదికలకే పరిమితం కాకుండా టీవీ చర్చలు, యూట్యూబ్ వీడియోలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. దీంతో ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారానికి తనదైన రీతిలో సమాధానం ఇవ్వడమే కాకుండా, ప్రజల్లో రాజకీయ చర్చను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**గ్రామీణ ప్రాంతాలపై దృష్టి**
బీఆర్ఎస్ డిజిటల్ ప్రచారం పట్టణ ప్రాంతాలు, యువత, విద్యావంతులైన ఓటర్లలో ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ.. తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో నాయకుడి ప్రత్యక్ష హాజరు, స్థానిక కార్యకర్తలతో అనుసంధానం, ప్రజలతో ముఖాముఖి సంబంధాలు ఇప్పటికీ కీలకంగా ఉన్నాయి. రేవంత్ రెడ్డి ఇదే అంశాన్ని తన రాజకీయ వ్యూహంలో ప్రధానంగా మలుచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలకు వెళ్లి సభల్లో మాట్లాడటం, స్థానిక సమస్యలను ప్రస్తావించడం, ప్రతిపక్షంపై విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతో పాటు ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం జరుగుతోంది.

**వ్యూహంలో ముప్పులూ ఉన్నాయి**
అయితే రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఘాటు వ్యాఖ్యల వ్యూహానికి ప్రతికూలతలు కూడా లేకపోలేదు. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలే ప్రధాన చర్చగా మారితే.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పనితీరు వంటి అసలు అంశాలు వెనుకబడే అవకాశం ఉంది. మరోవైపు రేవంత్ ప్రసంగాల్లోని వివాదాస్పద వ్యాఖ్యలను బీఆర్ఎస్ డిజిటల్ బృందం చిన్న వీడియోలుగా మార్చి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తోంది.

**ఆన్‌స్క్రీన్‌లో బీఆర్ఎస్.. ఆన్‌గ్రౌండ్‌లో కాంగ్రెస్**
ప్రస్తుతం తెలంగాణలో ప్రచార పోరును చూస్తే బీఆర్ఎస్ సామాజిక మాధ్యమాల్లో దూకుడుగా వ్యవహరిస్తుండగా.. రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో తన బలాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే దీర్ఘకాలంలో కాంగ్రెస్ కేవలం ముఖ్యమంత్రి పర్యటనలు, ప్రసంగాలపై ఆధారపడకుండా తన డిజిటల్ వ్యవస్థను కూడా బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది.
ఎన్నికల రాజకీయాల్లో సామాజిక మాధ్యమాల ప్రచారం వేగంగా ప్రభావం చూపించినా.. ప్రజలను నేరుగా కలుసుకోవడం, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం, క్షేత్రస్థాయిలో రాజకీయ సంబంధాలను బలోపేతం చేయడం దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే అంశాలుగా నిలుస్తాయి. దీంతో ప్రస్తుతానికి బీఆర్ఎస్ డిజిటల్ దాడికి దీటుగా రేవంత్ రెడ్డి తన ప్రత్యక్ష రాజకీయ దూకుడును అస్త్రంగా మలుచుకుంటున్నారని చెప్పవచ్చు.

# రియల్‌ఎస్టేట్ సంస్థగా కాంగ్రెస్ ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి**
**రూ.500 కోట్ల భూమి రూ.87 కోట్లకే**
హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలోని అజామాబాద్‌లో ఆయిల్‌ఫెడ్ సంస్థకు చెందిన 3 ఎకరాల 23 గుంటల భూమి ఉందని హరీశ్ రావు తెలిపారు.
15,984 గజాల విస్తీర్ణంలోని ఈ భూమి బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.500 కోట్ల విలువ చేస్తుందని పేర్కొన్నారు.
అలాంటి విలువైన భూమిని కేవలం రూ.87 కోట్లకే ప్రైవేటు వ్యక్తికి అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆరోపించారు. రూ.87 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నప్పటికీ, దానిని పక్కనబెట్టి ప్రైవేటు వ్యక్తికి భూమిని కట్టబెట్టడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**సుప్రీంకోర్టు తీర్పును విస్మరణ**
1987లో ప్రైవేటు సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని హరీశ్ రావు గుర్తుచేశారు.
ఆ భూమిపై పూర్తి హక్కు ప్రభుత్వానిదేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని తెలిపారు.
బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎలాంటి ప్రైవేటు శక్తులకు తలొగ్గకుండా వందల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడామని పేర్కొన్నారు. ఒకవైపు సామాన్యుల ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నాయకులు, మరోవైపు కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలి, అజామాబాద్‌లోని ఖరీదైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని విమర్శించారు.

**నిర్ణయం వెనక్కి తీసుకోవాలి**
స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆస్తులను ఇలాగే విక్రయిస్తూ పోతే భవిష్యత్తులో బడికి, గుడికి, చివరకు స్మశానానికి కూడా స్థలం మిగలదని హరీశ్ రావు హెచ్చరించారు.
అజామాబాద్ భూముల కేటాయింపును ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ భూమికి సంబంధించిన పూర్తి ఫ్రీ హోల్డ్ హక్కులను ఆయిల్‌ఫెడ్‌కే కల్పించాలని కోరారు. ప్రజల సొత్తును ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు న్యాయపోరాటంతో పాటు ప్రజాక్షేత్రంలోనూ మహా పోరాటం చేస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.

# నేపాల్‌లో తెలంగాణవారి కోసం సమన్వయం

**హైదరాబాద్, ఆగస్టు 30, :**

నేపాల్‌లో సంభవించిన వరద విపత్తు నేపథ్యంలో తెలంగాణకు చెందిన వారి ఆచూకీ, సురక్షిత తరలింపు, పార్థివదేహాల గుర్తింపు, స్వదేశానికి తరలింపు అంశాలపై తెలంగాణ భవన్ అధికారులు నిరంతర సమన్వయం కొనసాగిస్తున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం, నేపాల్ పోలీసులతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.



**భారతీయుల తరలింపు**

భారత విదేశాంగ శాఖ అధికారుల వివరాల ప్రకారం ఆగస్టు 29న టిబెట్ నుంచి నేపాల్‌కు 449 మంది భారతీయులు చేరుకున్నారు. ఆగస్టు 30న మరో 397 మందిని అదే మార్గంలో తరలించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ జాబితాలో తెలంగాణకు చెందిన అల్లి ఐయిలేష్ పేరు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయన పాస్‌పోర్టు వివరాలు తెలంగాణ భవన్ వద్ద ఉన్న రికార్డులతో సరిపోలాయి. ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులతో సంప్రదింపుల్లో ఉన్నారని, ఆదివారం రాత్రి సుమారు 10 గంటలకు హైదరాబాద్‌కు చేరుకునే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

**నేపాల్ వెళ్లాల్సిన అవసరం లేదు**

నేపాల్ ప్రభుత్వం మృతుల ఛాయాచిత్రాలు, ప్రాథమిక వివరాలను నేపాల్ పోలీసుల డిజాస్టర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచింది. రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా, తనహున్, నావల్పరాసీ తూర్పు, నావల్పరాసీ పశ్చిమ, ఖాఠ్మాండూ జిల్లాల్లో భద్రపరిచిన పార్థివదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది.

కుటుంబ సభ్యులు ప్రత్యక్షంగా గుర్తించగలిగితే డీఎన్‌ఏ పరీక్ష తప్పనిసరి కాదని నేపాల్ పోలీసులు తెలిపారు. మృతుడితో బంధుత్వాన్ని నిర్ధారించే ఆధారాలను పరిశీలించిన అనంతరం పార్థివదేహాన్ని సంబంధిత కుటుంబానికి అప్పగించనున్నారు. ప్రత్యక్ష గుర్తింపు సాధ్యం కాని సందర్భాల్లో తల్లిదండ్రులు, సోదరులు, సోదరీమణులు వంటి తొలి స్థాయి బంధువుల డీఎన్‌ఏ ప్రొఫైల్‌ను సరిపోల్చనున్నారు. ఇందుకోసం బంధువులు నేపాల్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. స్వస్థలంలో సిద్ధం చేసిన డీఎన్‌ఏ ప్రొఫైల్‌ను సమర్పించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన ఈమెయిల్ విధానాన్ని నేపాల్ పోలీసులు రూపొందిస్తున్నారు.

**అధికారిక నిర్ధారణ తర్వాతే సమాచారం**

పార్థివదేహాల గుర్తింపు, కుటుంబాలకు అప్పగింత, స్వదేశానికి తరలింపునకు సంబంధించిన పూర్తి విధివిధానాలను నేపాల్ అధికారులు ఖరారు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు కుటుంబ సభ్యులు స్వయంగా నేపాల్‌కు వెళ్లకుండా తెలంగాణ భవన్, భారత రాయబార కార్యాలయంతో సంప్రదించాలని అధికారులు సూచించారు. ప్రతి కేసులో అధికారిక నిర్ధారణ పూర్తయిన తర్వాతే సంబంధిత కుటుంబాలకు, ప్రజలకు తదుపరి సమాచారం అందిస్తామని అధికారులు వెల్లడించారు.

# NEET-PGలో 15 శాతం AIQ చేయాలి

- **50 శాతం ఆల్ ఇండియా కోటాను తగ్గించాలని వినోద్ కుమార్ లేఖ**
- **తెలంగాణలో పెరిగిన ప్రభుత్వ వైద్య కళాశాలలు, పీజీ సీట్లు**
- **రాష్ట్ర నిధులతో ఏర్పాటైన సీట్లలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్**
- **AIQ కింద రాష్ట్రాల వారీగా పారదర్శక గణాంకాలు విడుదల చేయాలి**
- **సమతుల్య సమాఖ్య విధానం అవసరమని కేంద్రానికి సూచన**

**హైదరాబాద్, ఆగస్టు 30, :**

NEETPGలో ప్రస్తుతం అమల్లో ఉన్న 50 శాతం ఆల్ ఇండియా కోటా (AIQ)ను 15 శాతానికి తగ్గించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాను కోరారు. దేశవ్యాప్తంగా జరిగిన NEETPG పరీక్ష సందర్భంగా తెలంగాణ వైద్య విద్యార్థులు, వైద్యుల నుంచి అందిన సమాచారం, వారి ఆందోళనల నేపథ్యంలో ఈ మేరకు కేంద్ర మంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు.



**రాష్ట్ర నిధులతో వైద్య విద్య**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం జిల్లాల వారీగా పలు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసిందని వినోద్ కుమార్ తెలిపారు. వైద్య విద్యతో పాటు పీజీ సీట్ల సంఖ్యను కూడా గణనీయంగా పెంచిందని పేర్కొన్నారు. ఈ వైద్య కళాశాలలు, సీట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రజల నిధులు, ప్రభుత్వ వనరులు వినియోగిస్తున్నందున వాటిలో అధిక భాగం తెలంగాణ వైద్య విద్యార్థులకు అందుబాటులో ఉండేలా విధానం రూపొందించాలని కోరారు.

**AIQలో సమతుల్యత అవసరం**

NEETUGలో 15 శాతం AIQ అమల్లో ఉండగా, NEETPGలో 50 శాతం AIQ కొనసాగడం సమతుల్యంగా లేదని వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. పీజీ వైద్య విద్యలోనూ AIQను 15 శాతానికి తగ్గించాలని కేంద్ర మంత్రిని కోరారు.

**రాష్ట్రాల వారీగా గణాంకాలు**

ప్రతి రాష్ట్రం నుంచి AIQకు ఎన్ని ప్రభుత్వ పీజీ సీట్లు వెళ్తున్నాయి, ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంతమంది విద్యార్థులు ఆయా సీట్లను పొందుతున్నారనే వివరాలను రాష్ట్రాల వారీగా పారదర్శకంగా వెల్లడించాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రస్తుత AIQ విధానంపై సమగ్ర సమీక్ష నిర్వహించి, రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మార్పులు చేయాలని కోరారు.

**సమాఖ్య విధానం అవసరం**

ఈ డిమాండ్ తెలంగాణకు మాత్రమే పరిమితం కాదని వినోద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రాలు తమ ప్రజా నిధులతో అభివృద్ధి చేస్తున్న వైద్య విద్యా మౌలిక వసతులకు అనుగుణంగా పీజీ సీట్లలో రాష్ట్ర విద్యార్థులకు సముచిత వాటా లభించేలా సమతుల్యమైన సమాఖ్య విధానం అవసరమని ఆయన స్పష్టం చేశారు.

# భారత వైద్య వ్యవస్థపై విదేశీ అనుభవంతో డాక్టర్ ప్రశంసలు

- **బ్రిటన్‌తో పోల్చిన వైద్యురాలి వీడియో వైరల్**
- **అర్ధరాత్రి కూడా మందులు సులభంగా లభించడంపై ప్రస్తావన**
- **వైద్య సేవల్లో భారత్‌కు ఉన్న సౌలభ్యాన్ని వివరించిన డాక్టర్**
- **భారత వైద్య వ్యవస్థలోనూ లోపాలు ఉన్నాయని స్పష్టీకరణ**
- **వీడియోపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న నెటిజన్లు**

**హైదరాబాద్, ఆగస్టు 30 :**

భారత్, యునైటెడ్ కింగ్‌డమ్‌లో వైద్య సేవల లభ్యతను పోలుస్తూ భారతీయ వైద్యురాలు డాక్టర్ దీపాంజలి శర్మ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాత్రివేళ తన భర్తకు అకస్మాత్తుగా అనారోగ్యం రావడంతో మందులు, ఐవీ ఇంజెక్షన్ల కోసం బయటకు వెళ్లిన ఆమె.. ఆ సమయంలో భారత్‌లో ఉండటం ఎంత సౌకర్యంగా ఉందో వివరించారు.

**రాత్రి వేళ మందుల కోసం బయటకు**

డాక్టర్ శర్మ భర్త కూడా వైద్యుడే. ఆయనకు తొలుత తలనొప్పి రావడంతోపాటు వరుసగా వాంతులు కావడంతో ఆమె రాత్రి 10 గంటల సమయంలో మందుల కోసం బయటకు వెళ్లారు. అవసరమైన మందులు, ఐవీ ఇంజెక్షన్లు తీసుకుని తిరిగి ఇంటికి చేరుకునే అవకాశం భారత్‌లో ఉండటం తనకు గొప్ప విషయంగా అనిపించిందని ఆమె పేర్కొన్నారు.

**పాశ్చాత్య దేశాల్లో భిన్న పరిస్థితులు**

బ్రిటన్‌తో పాటు ఇతర పాశ్చాత్య దేశాల్లో సాధారణ పని వేళలు దాటిన తర్వాత అత్యవసర వైద్య సహాయం, కొన్ని మందులు పొందడం కష్టంగా ఉంటుందని డాక్టర్ శర్మ తెలిపారు. అత్యవసర విభాగాల్లో ఇప్పటికే రద్దీ, ఒత్తిడి ఉండటంతో వెంటనే వైద్య సహాయం అందడం కష్టమయ్యే అవకాశం ఉందన్నారు. మందులు కూడా వెంటనే లభించకపోవచ్చని చెప్పారు.

**భారత్‌లో సౌలభ్యమే బలమని వ్యాఖ్య**

భారత్‌లో అర్ధరాత్రి అయినా బయటకు వెళ్లి అవసరమైన మందులు తీసుకొచ్చి, తిరిగి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యుడిని చూసుకునే అవకాశం ఉండటాన్ని ఆమె ప్రస్తావించారు. 24 గంటల ఫార్మసీలు, అందుబాటులో ఉండే వైద్య సేవలు భారత వైద్య వ్యవస్థకు ఉన్న సౌలభ్యాన్ని చూపుతున్నాయని చెప్పారు.



**లోపాలు లేవని చెప్పడం లేదని స్పష్టీకరణ**

భారత వైద్య వ్యవస్థలో ఎలాంటి లోపాలు లేవని తాను చెప్పడం లేదని డాక్టర్ శర్మ స్పష్టం చేశారు. ఇంకా మెరుగుపరచాల్సిన అంశాలు ఉన్నాయని, ఏ దేశంలోనూ వైద్య సేవలు పూర్తిగా పరిపూర్ణంగా ఉండవని పేర్కొన్నారు. అయితే భారత్‌లో సాధారణ ప్రజలకు వైద్య సేవలు, మందులు సులభంగా అందుబాటులో ఉండటం ఒక ప్రత్యేకతగా అభిప్రాయపడ్డారు.

**నెటిజన్ల నుంచి భిన్న స్పందనలు**

డాక్టర్ శర్మ వీడియోపై నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. భారత్‌లో 24 గంటల ఫార్మసీలు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో మందులు త్వరగా పొందగలుగుతున్నామని పలువురు పేర్కొన్నారు. అయితే ప్రిస్క్రిప్షన్ లేకుండానే కొన్ని మందులు సులభంగా లభించడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మరికొందరు ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఇక క్రాస్ వాల్యుయేషన్

**హైదరాబాద్, ఆగస్టు 30 :**

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత కచ్చితంగా అంచనా వేసేందుకు విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై విద్యార్థుల జవాబు పత్రాలను అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కాకుండా ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయించే క్రాస్ వాల్యుయేషన్ విధానాన్ని అమలు చేయనున్నారు.



**నిష్పక్షపాత మూల్యాంకనం**

1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే SA1, SA2 పరీక్షల జవాబు పత్రాలతో పాటు 10వ తరగతి SA1 పరీక్ష పేపర్లను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు దిద్దరు. ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు వాటిని అప్పగించి మూల్యాంకనం చేయిస్తారు.

తమ వద్ద చదివే విద్యార్థుల జవాబు పత్రాలను ఉపాధ్యాయులు దిద్దే సమయంలో మార్కుల కేటాయింపులో హెచ్చుతగ్గులు జరిగే అవకాశం ఉంటుంది. క్రాస్ వాల్యుయేషన్ ద్వారా ఇలాంటి పక్షపాతానికి అడ్డుకట్ట వేసి, సమాధానాల ఆధారంగా ప్రామాణిక మార్కులు కేటాయించే అవకాశం ఉంటుంది.

**మండల కేంద్రాల్లో కేంద్రాలు**

క్రాస్ వాల్యుయేషన్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో ఈ కేంద్రాలు పనిచేస్తాయి. ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను మూల్యాంకన విధులకు కేటాయించి జవాబు పత్రాల దిద్దుబాటు ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

**విద్యా సామర్థ్యంపై స్పష్టత**

నిష్పక్షపాతంగా వెలువడే ఫలితాల ద్వారా ప్రతి విద్యార్థి అసలైన విద్యా సామర్థ్యాన్ని గుర్తించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే ఏయే అంశాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో స్పష్టంగా తెలుసుకోవచ్చు.

ఈ ఫలితాల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన, రెమెడియల్ తరగతులు నిర్వహించేందుకు వీలు కలుగుతుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు క్రాస్ వాల్యుయేషన్ విధానం దోహదపడుతుందని విద్యాశాఖ భావిస్తోంది.



# తెలంగాణలో గోదావరి పుష్కరాల నిర్వహణకు సన్నాహాలు

**హైదరాబాద్, ఆగస్టు 30**

గోదావరి పుష్కరాలు అంటే రాజమహేంద్రవరం పేరు గుర్తుకొచ్చే పరిస్థితిని మార్చి, ఇకపై తెలంగాణతో గోదావరి పుష్కరాలకు ప్రత్యేక అనుబంధం ఏర్పడేలా వచ్చే ఏడాది ఉత్సవాలను నిర్వహించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. 'గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు' అనేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు.

**రూ.1,000 కోట్లతో ఏర్పాట్లు**

2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.1,000 కోట్ల నిధులు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా**

పుష్కరాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాలు పరిచయమయ్యేలా వసతులు కల్పించాలని సురేఖ సూచించారు. పుష్కర ఘాట్లు, భక్తుల రాకపోకలు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని చెప్పారు.

**సమన్వయానికి ప్రత్యేక కార్యాలయం**

గోదావరి పుష్కరాలు 2027 పనుల సమన్వయం కోసం ప్రజాభవన్‌లోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారి కార్యాలయాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులతో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖల మధ్య సమన్వయానికి ఈ కార్యాలయం కేంద్ర బిందువుగా పనిచేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.




# నీట్ పీజీ పరీక్షలో కలకలం

- **సెక్యూరిటీ దాటుకుని మద్యం మత్తులో హాజరు**
- **పరీక్ష హాల్‌లో విద్యార్థి తీరుపై సిబ్బందికి అనుమానం**

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30:**

తెలంగాణలో నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసిన వేళ రంగారెడ్డి జిల్లాలో ఓ విద్యార్థి మద్యం మత్తులో పరీక్ష రాసేందుకు రావడం కలకలం రేపింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకున్నారు. అయితే ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలోని పరీక్ష కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ రిజ్వాన్ మద్యం సేవించి పరీక్షకు హాజరైనట్లు గుర్తించారు.

**సెక్యూరిటీ దాటుకుని పరీక్ష హాల్‌లోకి**

రిజ్వాన్ సాధారణ తనిఖీలను దాటుకుని పరీక్ష హాల్‌లో తన సీటు వరకు వెళ్లాడు. అయితే అతడి ప్రవర్తనలో తేడా కనిపించడంతోపాటు మద్యం వాసన రావడంతో పరీక్ష సిబ్బందికి అనుమానం వచ్చింది. దీంతో అతడిని వెంటనే బయటకు పంపి మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

**బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష**

మరోసారి నిర్వహించిన తనిఖీలో రిజ్వాన్ మద్యం సేవించి వచ్చినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష నిర్వహించారు. మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**సెక్యూరిటీపై ప్రశ్నలు**

నీట్ పీజీ వంటి కీలక పరీక్షకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ విద్యార్థి మద్యం మత్తులో పరీక్ష హాల్ వరకు చేరుకోవడం చర్చనీయాంశంగా మారింది. పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించే ముందు తనిఖీల తీరుపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# నార్త్ సైప్రస్ తీరంలో ఫెర్రీ బోల్తా

- **వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు**
- **ప్రయాణికుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు**
- **ప్రాణనష్టంపై ఇంకా అధికారిక సమాచారం లేదు**

**కైరేనియా, ఆగస్టు 30, :**

నార్త్ సైప్రస్ తీరంలో ఆదివారం సుమారు 270 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఫెర్రీ సముద్రంలో బోల్తాపడింది. నౌకలోకి ఒక్కసారిగా నీరు చేరడంతో ప్రమాదం జరిగినట్లు టర్కిష్ సైప్రియట్, టర్కీ మీడియా సంస్థలు వెల్లడించాయి. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సెర్చ్ అండ్ రెస్క్యూ చర్యలు ప్రారంభించారు. ఇప్పటివరకు ప్రాణనష్టం జరిగినట్లు అధికారిక సమాచారం లేదు.

**మార్గమధ్యంలో నీరు చేరడంతో**

కాటమరాన్ తరహా ఫెర్రీ నార్త్ సైప్రస్‌లోని కైరేనియా పోర్టు నుంచి టర్కీలోని మెర్సిన్ ప్రావిన్స్‌లోని తసూకు పోర్టుకు బయలుదేరింది. తీరానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉండగా నౌకలోకి నీరు చేరడం ప్రారంభమైంది. దీంతో కొద్దిసేపటికే ఫెర్రీ అదుపుతప్పి సముద్రంలో బోల్తాపడినట్లు టర్కీ ప్రభుత్వ ప్రసార సంస్థ తెలిపింది.

**మంత్రి ధ్రువీకరణ**

ఫెర్రీ ప్రమాదానికి గురైన విషయాన్ని నార్త్ సైప్రస్ రవాణా మంత్రి ఎర్హాన్ అరిక్లీ ధ్రువీకరించారు. ప్రమాద ప్రాంతానికి సహాయక బృందాలు చేరుకున్నాయని తెలిపారు.

**కొనసాగుతున్న సహాయక చర్యలు**

ప్రమాదం అనంతరం ప్రయాణికులను గుర్తించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు అధికారులు గాలింపు, సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంతమందిని రక్షించారు, ప్రయాణికుల పరిస్థితి ఏమిటన్న వివరాలను అధికారులు వెల్లడించలేదు.

## రైతులు తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలి

### జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య

**బోనకల్,ఆగస్టు30,(డీడీ 9వార్త):**

డిజిటల్ క్రాప్ సర్వేలో పంటల ప్రక్రియను వేగవంతం చేసి ప్రతి రైతు పంట వివరాలను తప్పు లేకుండా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య సూచించారు,ఆదివారం చిన్నబీరవల్లి గ్రామంలో డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్ నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వేను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు.రైతులు పండించిన పత్తి,వరి,పెసర తదితర పంటల వివరాలు సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు.పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే సమయంలో రైతుల వివరాలు,పంటలు వివరాలు సరిగా నమోదు కాకపోతే నష్టపోయే అవకాశం ఉందని ఆయన తెలిపారు అందువల్ల పంటల నమోదు సమయంలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తగా ఆన్లైన్లో వివరాలు నమోదు చేయాలని వాలంటీర్లను ఆదేశించారు. రైతులు తమ గ్రామాల్లో పంటలు వివరాలను నమోదు చేస్తున్న వాలంటీర్లను సంప్రదించి తమ పంటల వివరాలు తప్పు లేకుండా నమోదు చేశారో లేదో పరిశించుకోవాలని సూచించారు. వాలంటీర్లు త్వరితగతన రైతుల పంటలు వివరాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పీ. వినయ్ కుమార్ , చిన్నబీరవల్లి వ్యవసాయ విస్తరణ ఎస్కే.హుస్సేన్ సాహెబ్ రైతులు,వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఏఈ విద్యుత్ కార్యాలయం ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**బోనకల్,ఆగస్టు 30, (డీడీ 9వార్త):**

మండల పరిధిలోని కలకోట గ్రామంలో టీజీఎన్పీడీసీఎల్ సెక్షన్ ఏఈ నూతన విద్యుత్ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఏర్పాటుతో స్థానిక ప్రజలకు విద్యుత్ సంబంధిత సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పైడిపల్లి అనిత కిషోర్,విద్యుత్ శాఖ అధికారులు చీఫ్ ఇంజనీర్ ఆపరేషన్ వరంగల్ ఖమ్మం ఎస్ఈ ఈ శ్రీనివాసచారి,డి ఈ ఆఫ్ మధిర బి శ్రీనివాసరావు బోనకల్ ఏడిఈ వై ఈ ఆనంద్ కుమార్,కలకోట సెక్షన్ ఏఈ జి మోహన్,బోనకల్ సెక్షన్ ఏఈ టి మనోహర్,కలకోట ఎల్ఐ జి నరసింహారెడ్డి,విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధుడు రావుట్ల పుల్లయ్య చారి మృతి.

### నివాళులర్పించిన పలువురు ప్రముఖులు.



**బోనకల్,ఆగస్టు 30, (డీడీ9 వార్త):**

బోనకల్ మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ చారి తండ్రి శతాధిక వృద్ధుడు రావుట్ల పుల్లాచారి (102) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. వారి పార్థివ దేహాన్ని పలువురు ప్రముఖుల సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాప సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో తెలుగుదేశం పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం.మల్లాది హనుమంతరావు ఖమ్మం తెదేపా నాయకులు కేతినేని హరీష్, చెరుకూరి చలపతి, మోతుకూరి వెంకటేశ్వరరావు బోనకల్ మండల కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, ఈది అనిల్,దామందుల సామెలు,పారుపల్లి నరసింహారావు,పారుపల్లి చందు వాసిరెడ్డి పురుషోత్తరావు పాటిబండ్ల సుబ్బారావు కొంగర జగన్ మోహన్ రావు, నందమూరి సత్యనారాయణ, మైనేని రవికుమార్, గంగూరి రాఘవరావు,గంగసాని రాఘవరావు, సాదినేని కొండలరావు, నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నాగారంలో వనం మైసమ్మకు ఘనంగా బోనాల సమర్పణ

**జనగామ ఆగస్టు 30(డిడి 9వార్త)బ్యూరో**



లింగాల ఘనపూర్ మండల పరిధిలోని నాగారం గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనం మైసమ్మ అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు, మహిళలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని వనం మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# ఘనంగా దొడ్డి కొమరయ్య సినిమా వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**డిడి9వార్త / రామగుండం ఆగష్టు 31:**




గోదావరిఖని పట్టణంలో ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం దగ్గర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య సినిమా వాల్ పోస్టర్ ని రామగుండం నియోజకవర్గ దొడ్డి కొమరయ్య సినిమా సహ నిర్మాతలు ఆవిష్కరించారు. అనంతరం దొడ్డి కొమరయ్య సినిమా ప్రచారంలో భాగంగా ర్యాలీగా వెళ్లి హెచ్ఎంఎస్ ఆఫీసులో రామగుండం నియోజకవర్గం నుండి దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణంలోకి సహనిర్మాతలుగా చేరిన 31 మంది సహనిర్మాతలకు ఘనంగా సన్మానించారు. అనంతరం రామగుండం నియోజకవర్గ దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ గౌరవ సలహాదారులు, సహనిర్మాత రాదండి బాలయ్య మాట్లాడుతూ ఇప్పటికైనా తెలంగాణ వీరుల చరిత్రలు బయటికి రావాలి అని అన్నారు.దొడ్డి కొమరయ్య సినిమా దర్శకులు ఎం సేనాపతి మాట్లాడుతూ 243 కులాలతో దొడ్డి కొమరయ్య సినిమాని తీయడం నా అదృష్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ గౌరవ అధ్యక్షులు గంటి శంకరయ్య పటేల్, గౌరవ సలహాదారులు, సహనిర్మాతలు కాసర్ల రాజిరెడ్డి, తోడేటి శంకర్ గౌడ్, గోగుల రాజిరెడ్డి, ఆరెల్లి మల్లేష్, రామగుండం నియోజకవర్గ దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ చైర్మన్, సహనిర్మాత సాయిరి సాంబయ్య, కో చైర్మన్లు, సహ నిర్మాతలు చిన్నాల మల్లయ్య యాదవ్, దేవా భారతి, రామగుండం నియోజకవర్గ సినిమా సహ నిర్మాతలు సూర లక్ష్మి, బోదాసు రజిత, ఠాకూర్ లలితా దేవి, బోయరా పంచ పూల, గొట్టేపర్తి వెంకటమ్మ, డాక్టర్ లెక్కల నగేష్, కుక్క చంద్రమౌళి, కొమ్మ కుమార్ యాదవ్, కల్లేపల్లి నర్సింగం, ఉదరి స్వామి గౌడ్, గంటి సాయి పటేల్ తేజ్ , పెద్దపల్లి జిల్లా దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ చైర్మన్, సహనిర్మాత బత్తుల శంకర్, కరీంనగర్ జిల్లా దొడ్డి కొమరయ్య సినిమా సహ నిర్మాత శ్రీమతి రెడ్డి. తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం...

- ఉప ముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క మల్లు
- రైతులు, మహిళలు,బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా
- విద్యా, వైద్యం, రహదారి, నీటిపారుదల రంగాల అభివృద్ధికి భారీగా నిధులు
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు కృషి
- చింతకాని,బోనకల్ మండలాల్లో రూ.131.61 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన డిప్యూటీ సీఎం



**బోనకల్,ఆగస్టు30,(డీడీ 9 వార్త):**

దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మధిర నియోజకవర్గంలోని చింతకాని,బోనకల్ మండలాల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వ్యవసాయ రంగాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చింతకాని మండలంలోని కొదుమూరు ఎస్సీ కాలనీలో రూ.66 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, లచ్చగూడెంలో రూ.29 కోట్లతో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి, రూ.1.75 కోట్లతో లచ్చగూడెం –నేరడ పీఆర్ రహదారి వరకు చింతకాని–వందనం ఆర్అండ్బీ రహదారి నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి, రూ.7 కోట్లతో లచ్చగూడెం– అనంతారం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. చింతకాని గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.44 లక్షలతో, నాగిలిగొండ ఎస్సీ కాలనీలో రూ.85 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, నాగిలిగొండ నుంచి తూటికుంట్ల వరకు రూ.5.25 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. బోనకల్ మండలంలోని నారాయణపురం ఎస్సీ కాలనీలో రూ.63 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి, రూ.1 కోటితో ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, రాయన్నపేట ఎస్సీ కాలనీలో రూ.19 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. నారాయణపురంలో రూ.80.84 లక్షలతో నిర్మించిన 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పీఏసీఎస్ గోదాంను, మోటమర్రిలో రూ.24.50 లక్షలతో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పీఏసీఎస్ గోదాంను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. అదేవిధంగా కలకోట – రాపల్లి–గన్నవరం– ముసలిమడుగు–లక్ష్మీపురం రహదారిని రూ.57 కోట్లతో కిలోమీటర్ 0/0 నుంచి 20/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేసే పనులకు, బ్రాహ్మణపల్లి–గన్నవరం మీదుగా రాపల్లి వరకు ఉన్న పీడబ్ల్యూడీ రహదారిని రూ.26 కోట్లతో కిలోమీటర్ 0/0 నుంచి 8/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేసే పనులకు శంకుస్థాపనలు చేశారు. రాపల్లిలో రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు కూడా డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ నేటి ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమం కోసం అనేకకార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, 53 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి పథకం క్రింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు.ఇండ్లు లేని నిరుపేదలకు ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఇప్పటి వరకు 7 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని అన్నారు. నిరుద్యోగ యువత కోసం తొలి ఏడాదిలో 70 వేలకు పైగా నియామక పత్రాలు పంపిణీ చేశామని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా క్రింద రికార్డు సమయంలో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని కేవలం 9 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన వేల కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది పేద విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించామని చెప్పారు.

**విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు:**

విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ 100 ఇంటిగ్రేటెడ్ గురుకులాలను మంజూరు చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక్కో ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని రూ.200 కోట్ల నిధులతో 25 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒకే కుటుంబంలా కలిసి చదువుకునేలా ఈ పాఠశాలలను నిర్మిస్తున్నామని, తద్వారా సామాజిక మార్పుకు నాంది పలుకుతున్నామని తెలిపారు. తెలంగాణలో మరో 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను మంజూరు చేశామని అన్నారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్ చార్జీలను 40 శాతం, కాస్మొటిక్ చార్జీలను 200 శాతం పెంచామని తెలిపారు.

**రోడ్లు,నీటిపారుదల, వైద్య రంగాలకు భారీగా నిధులు:**

రాష్ట్రంలోని రహదారి నెట్వర్క్ను బలోపేతం చేసేందుకు రూ.90 వేల కోట్లతో పలు ప్రణాళికలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులకు మరో రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. పెండింగ్లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన భూసేకరణను పూర్తిచేయడానికి భారీ ఎత్తున నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక ఆసుపత్రులను అందుబాటులోకి తీసుకొస్తున్నామని, అదనంగా 14 వేల పడకలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.

**మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు.. ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ భీమా:**

మహిళా సంఘాలకు ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను వడ్డీ లేకుండా అందిస్తున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. వడ్డీ లేని రుణాల పరిమితి ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా పథకం క్రింద రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. దేశంలో మరేరాష్ట్రంలో లేని విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వ్యతిరేకంగా కొంతమంది రాజకీయ వ్యక్తులు కృషి చేస్తున్నారని, వారి వలలో ప్రజలు పడవద్దని డిప్యూటీ సీఎం సూచించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని, అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా అని, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసేందుకు బాటలు వేస్తున్నామని అన్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన జపాన్, కొరియా వంటి దేశాలతో తెలంగాణ పోటీ పడే విధంగా రాష్ట్రాన్ని నిలిపేందుకు ముఖ్యమంత్రి నాయకత్వంలో క్యాబినెట్, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్,పోలీస్ కమీషనర్ సునీల్ దత్,సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్,విద్యుత్ శాఖ సీఈ అశోక్,ఎస్ఈ శ్రీనివాసచారి,ఆర్అండ్బీ ఎస్ఈ యుగంధర్ రావు,పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి,సీపీఓ శ్రీనివాస్,హౌజింగ్ పీడీ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పొలం గట్టున ఆత్మీయ పలకరింపు..

- రైతు కూలీలతో ముచ్చటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా
- సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణంతో మేలు జరుగుతోందన్న మహిళలు

**బోనకల్,ఆగస్టు 30,(డీడీ9 వార్త):**



మండల పరిధిలోని రాయన్నపేట శివారుల్లో పొలం పనుల్లో నిమగ్నమైన రైతు కూలీలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆప్యాయంగా పలకరించి వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు తమ కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని మహిళలు డిప్యూటీ సీఎంకు ఆనందంగా వివరించారు. ప్రజల సమస్యలు, అవసరాలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటిని పరిష్కరించడం, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబ జీవితంలో సానుకూల మార్పు తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

# మానవత్వం చాటుకున్న భాగం సేవా ఫౌండేషన్

- **జర్నలిస్ట్ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం..**
- **పిల్లల చదువులకు సహకరిస్తామని భరోసా**

**బోనకల్,ఆగస్టు 30, (డీడీ9 వార్త):**

మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన విజన్ ఆంధ్రా దినపత్రిక విలేకరి మందా సత్యానందం ఆగస్టు 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబం విషాదంలో మునిగింది.ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు భాగం సేవా ఫౌండేషన్ ముందుకు వచ్చింది. స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డేగల వేలాద్రి ద్వారా సత్యానందం కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న గోవిందాపురం (ఏ) గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ భాగం రాకేష్, భాగం సేవా ఫౌండేషన్ ద్వారా సహాయం అందించేందుకు ముందుకొచ్చారు. ఆదివారం ఆయన తండ్రి భాగం రాధాకృష్ణ సత్యానందం కుటుంబాన్ని పరామర్శించి, సత్యానందం చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు భాగం రాకేష్ రూ.10 వేలు,తన మిత్రుడు రామిశెట్టి రవి 2వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భాగం రాధాకృష్ణ మాట్లాడుతూ సత్యానందం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సత్యానందం కుటుంబానికి



భాగం సేవా ఫౌండేషన్ అండగా ఉంటుందని తెలిపారు.ముఖ్యంగా ఆయన పిల్లల చదువులకు అవసరమైన పుస్తకాలు,విద్యకు సంబంధించిన ఖర్చులను ఫౌండేషన్ తరపున భరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కుటుంబానికి భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చినా తమను సంప్రదిస్తే తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. విలేకరి కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్న భాగం సేవా ఫౌండేషన్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డేగల వేలాద్రి, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్,బడే,రామిశెట్టి రవి, గ్రామ సర్పంచ్ మందా కరుణ తదితరులు పాల్గొన్నారు.

# నేనే ప్రకృతిని నేనే ఆదివాసీని

**తాడ్వాయి డిడి9 వార్త**





**కల్తీ. క్రిష్ణమూర్తి**
తెలుగు పండిట్
సెల్ నం. 9494036818
AHS రాయినిగూడెం.

నేనే ప్రకృతిని ఆదివాసిల ఆకృతిని మీరు చేస్తున్న వికృతిని మీకు ఆనందాన్ని ఆహ్లాదాన్ని ఇచ్చేదాన్ని కనిపించి కనిపించని ఊహ లోకాన్ని ప్రతి శ్వాసనాది, నీశ్వాస నాది పొంగిపొరలుతున్న గోదావరి నాది నీటఎగురుతున్న కెరటాలు నావి నేనే ప్రకృతిని ఆదివాసిల ఆకృతిని నీవు కలం పట్టాలన్నా,గళం విప్పాలన్నా మాటలా డాలన్నా, మనసు విప్పాలన్నా నీవు పొందుతున్న పరవశానికి, ముగ్దుడవయ్యే సౌందర్యానికి పక్షుల కిల్లకిల చప్పుడు నాది ఆమని తియ్యని పాటలు నావి రూపంటు తెలియని అజ్ఞాతపు శిలను నేను నేనే ప్రకృతిని ఆదివాసీల ఆకృతిని మీరు నా రెక్కలు ముక్కలుగా నరుకుతుంటే నా ఎర్రని రక్తాన్ని మబ్బులుగా చేసి కంటిరెప్పల జలాల నుండి తుపానులై వడి వాడిగా త్వర త్వరగా వర్షాన్నె వచ్చేస్తా కొండకొనలనుండి వాగులను నడిపిస్తా ఎండిన మీ పొలాలకు జీవం నేనే పోస్తా లేలేత కిరణాలతో అజ్ఞానం తొలిగిస్తా. నేనే ప్రకృతిని ఆదివాసిల ఆకృతిని లేలేత చిగురాకులు పక్షులకు ఇచ్చేస్తా పసిడి పైరు లన్నింటిని మీకే అందిస్తా. నీ చెల్లి నవ్వు నాది విరబూసిన పువ్వు నాది కోకిల రాగం నాది వేణువు గానం నాది. పాల బుగ్గల పసిపాప బోసినవ్వులు నావి నేనే ప్రకృతిని ఆదివాసిల ఆకృతిని ఆకుపచ్చని బొట్టును నేను ఆచారాల అమ్మను నేను గూడెం గుండెల చప్పుడు నేను కట్టుబాటులకు నిలయం నేను అందరికి అడవమ్మను నేను నేనే ప్రకృతినీ ఆదివాసీల ఆకృతిని కొమ్ము సైరాన్ కూతలు నావే డోలు దరువుల ధ్వని నాదే గుస్సాడి శృంగపు నృత్యం నాదే రేలారే రేలా పాటలు నావే తుడుం మోతల చప్పుడు నాదే జీవం పుట్టుక అన్నీ నావే నేనే ప్రకృతినీ ఆదివాసీల ఆకృతిని విశ్వం ఎరిగిన జ్ఞానిని నేనే అడవి తల్లి బిడ్డని నేనే ఐక్యరాజ్యసమితి ఆమోదించిన ఆప్తున్నీ నేనే హక్కుల్ని కోల్పోతున్న ఒంటరిని నేనే సమాజంచూస్తూ గతం మరిచిన సమిదను నేనే నేనే ప్రకృతినీ ఆదివాసిల ఆకృతిని

# విశ్రాంత ఉపాధ్యాయుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తా

**ఎమ్మెల్యే జారె ఆదినారాయణ...**

**అశ్వరావుపేట:ఆగస్టు30(డిడి 9 వార్త)**

అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని చంద్రుగొండ మండల కేంద్రంలో విశ్రాంత ఉపాధ్యాయుల కోసం నిర్మించిన కమ్యూనిటీ భవనం ప్రారంభోత్సవ వేడుకలో గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు ఈ సందర్భంగా భవనం చుట్టూ రూ 5 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టి నందుకు విశ్రాంత ఉపాధ్యాయులు ఎమ్మెల్యే కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందించారు ఉపాధ్యాయుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కమ్యూనిటీ భవనానికి ప్రహరీ గోడ నిర్మాణం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు గతంలో తాను కూడా ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకున్న తరుణంలో ఉపాధ్యాయ వృత్తితో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా వెల్లడించారు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై వారితో చర్చించారు రిటైర్మెంట్ అనంతరం కూడా ఉపాధ్యాయులు సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉంటారని విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన అనుభవం సమాజానికి ఎంతో విలువైనదని పేర్కొన్నారు పదవీ విరమణ తర్వాత తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని క్రమబద్ధమైన జీవన విధానాన్ని పాటిస్తూ ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలని సూచించారు అదేవిధంగా తమ అనుభ



వాలను యువతకు విద్యార్థులకు పంచుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని గౌరవప్రదమైన వయసులో కూడా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు విశ్రాంత ఉపాధ్యాయుల సంక్షేమం వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజా ప్రతినిధులు మండల నాయకులు కార్యకర్తలు విశ్రాంత ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# ప్రశ్నిస్తున్న రామగుండం.. పోస్టర్ ఆవిష్కరణ

- **కాంగ్రెస్ మూడేళ్ల పాలనపై బీజేపీ రాష్ట్ర నాయకులు లావణ్య–అరుణ్‌కుమార్ ధ్వజం**
- **హామీల అమలుపై ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తాం**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 30 (డీడీ9 వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకులు సోమరపు లావణ్య, అరుణ్‌కుమార్ ఆరోపించారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ హామీల అమలు తీరును ప్రశ్నిస్తూ 'ప్రశ్నిస్తున్న రామగుండం' పేరుతో చేపట్టనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం రామగుండంలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వం మూడేళ్లు పూర్తి చేసుకుంటున్నప్పటికీ




హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం పేరుతో పాలన సాగిస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. రామగుండం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే 'ప్రశ్నిస్తున్న రామగుండం' కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం, ఉపాధి, అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు పరిస్థితిపై ప్రజల నుంచి వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను కేవలం గుర్తించడం మాత్రమే కాకుండా వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులను, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని చెప్పారు. అవసరమైన సందర్భాల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**ప్రజల తరపున ప్రశ్నిస్తాం**

నియోజకవర్గంలోని ప్రతి వర్గం ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిపై ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. "ప్రశ్నించే హక్కు ప్రజలది.. ప్రజల తరపున ప్రశ్నించడం మా బాధ్యత" అని పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

**భారీగా పాల్గొన్న నాయకులు**

పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సుల్వలక్ష్మి నర్సయ్య, మహావాది రామన్న, మామిడి రాజేశ్, మాతంగి రేణుక, దాసరి శ్రీనివాస్, పెద్దపల్లి పవన్, శ్రీరాముల సత్యం, బాణాల రంజిత్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు మచ్చా విశ్వాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిలుక భారతి, మండల అధ్యక్షులు ఐతే పవన్, మిట్టపల్లి సతీష్, నాయకులు కొమ్మ స్వామి యాదవ్, సృజన రజిత, అడ్దూరి రాజేష్, అరిగేల శ్రావణ్ యాదవ్, శివరామకృష్ణ, చుక్కల రాములు, బూడిద రమేశ్, పంగ రవి, మల్లేశ్, కంపెల్లి రఘు, సంతోష్, జూపిడి అమరేశ్వరరావు, రాజేష్ శర్మ, మహేందర్, బైరెం కుమార్, ఈదునూరి మల్లేష్ పాల్గొన్నారు. మహిళా నాయకులు వసంతలక్ష్మి, ధనలక్ష్మి, శ్రీదేవి, అంకుర్ భరత్తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# క్యాన్సర్ వ్యాధి తో బాధపడుతున్న బాసిక సంతోష్ కి నైనిష ఫౌండేషన్ ఆర్థిక సాయం



**మణుగూరు.ఆగస్టు 30 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గం, మణుగూరు మండలంలోని శేషగిరి నగర్ కి చెందిన ,బాసిక సంతోష్ తండ్రి కొమ్మలు, అనే వ్యక్తి క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతున్నారు అతనిపరిస్థితి చాలా దీనస్థితిలో ఉంది.తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో , దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటోంది. అతని దయనీయ పరిస్థితిని తెలుసుకున్న నైనిష ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించి, బాసిక సంతోష్ కి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నైనిష ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ సంస్థ అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ మట్టపల్లి సాగర్ యాదవ్, జర్నలిస్ట్ పోదిల వీరబాబు, అడ్వకేట్ ఈర్ల రాము, జర్నలిస్ట్ మిట్టపల్లి గోపి, ఉప్పాడి అనిత మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.



**మణుగూరు.ఆగస్టు30(డి డి 9వార్త)**

మణుగూరు సింగరేణి ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మామిడి కాంతారావు శ్రీమతి కనకలక్ష్మీ ఏకైక కుమారుడు పవన్ సాయి వివాహం కుసుమ శ్రీతో విజయవాడలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహానంతరం ఆదివారం మణుగూరు పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితుల సమక్షంలో రిసెప్షన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శుభ కార్యక్రమానికి ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు హాజరై నూతన వధూవరులు పవన్ సాయి–కుసుమ శ్రీ లను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐకమత్యంతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, సుద్దాల సంపత్ కుమార్, కోన వెంకటేష్, సంక్రాంతి యుగంధర్, మురళి పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఓటు హక్కుపై అలసత్వం వద్దు.. హియరింగ్ కు తప్పక హాజరు!

- **SIRలో 204 మంది ఓటర్లకు నోటీసులు.. అవసరమైన పత్రాలతో హాజరుకావాలి..**
- **తహసీల్దార్ మేద వేణుగోపాల్..**

**ఆగస్టు30 డిడి9 వార్త వెంకటాపురం.**



భారత ఎన్నికల సంఘం చేపట్టిన SIR (Special Intensive Revision) ప్రక్రియలో భాగంగా వెంకటాపురం మండలంలో 204 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. PS No.30–ఒంటిమామిడి పరిధిలో 130 మంది, PS No.48–రాచపల్లి పరిధిలో 74 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారికి సంబంధిత కార్యాలయాల్లో హియరింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఓటర్ల జాబితాలో తమ పేరును కొనసాగించేందుకు అర్హతను నిర్ధారించే అవసరమైన పత్రాలతో హియరింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని తహసీల్దార్ సూచించారు. నోటీసులు అందుకున్న వారు నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత హియరింగ్‌కు హాజరై తమ వివరాలను సమర్పించుకోవాలని కోరారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవడమే SIR ప్రక్రియ ఉద్దేశమని, ప్రజలు అధికారులకు సహకరించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

# భద్రాచలంలో ఆకట్టుకున్న 'శ్రీసీతాయణం' కూచిపూడి నృత్యరూపకం

**భద్రాచలం , ఆగస్టు 30 (డిడి9 వార్త )**

తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం టూరిజం హోటల్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కూచిపూడి నాట్యాలయ నిర్వాహకులు శ్రీమతి క్రాంతి నారాయణన్ బృందం ప్రదర్శించిన 'శ్రీసీతాయణం' నృత్యరూపకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. స్థానిక శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన సంస్కృతీ సాంప్రదాయాలను భావితరాలకు సజీవంగా అందించేలా తెలంగాణ ప్రభుత్వం టూరిజం ద్వారా ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో కళా వైభవాన్ని చాటుతున్న క్రాంతి నారాయణన్ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కళాకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ పూర్తి మద్దతుగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమానంతరం నాట్యాలయ నిర్వాహకురాలు క్రాంతి నారాయణన్ బృందానికి ఎమ్మెల్యే జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. అంతకుముందు నిర్వాహకులు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును ఘనంగా శాలువాతో సత్కరించారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ కులదైవ ఉత్సవాలు



**బోనకల్,ఆగస్టు30,(డీడీ9 వార్త):**

బోనకల్ గ్రామంలోని గిరిజన బంజారా సమాజం ఆధ్వర్యంలో కులదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో బోనకల్ గ్రామ సర్పంచ్ బానోత్ జ్యోతి కొండ పాల్గొని సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా నిలిచారని, సత్యం, ధర్మం, సేవ, ఐక్యత, మానవతా విలువలను సమాజానికి చాటిచెప్పారని అన్నారు. ఆయన బోధనలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.సేవాలాల్ మహారాజ్ చూపిన సత్యం, ధర్మం, ఐక్యత మార్గంలో నడుస్తూ సమాజంలో పరస్పర గౌరవం, సోదరభావం పెంపొందించుకోవాలని వారు ఆకాంక్షించారు.గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సేవాలాల్ మహారాజ్‌ను ప్రార్థించినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో గిరిజన పెద్దలు, మహిళలు,యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల సేవాలాల్ మహారాజ్ నామస్మరణతో గిరిజన కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## శిరీష మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలి

- **ఆదివాసి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**
- **అనుమానాస్పద మృతిపై లోతైన దర్యాప్తు అవసరం: మాజీ ఎమ్మెల్యే తాటి**





**అశ్వరావుపేట:ఆగస్టు 30( డిడి 9 వార్త)**

ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి యువతి శిరీష హైదరాబాద్ తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం పట్ల మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శిరీష మృతిపై కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానాలు లేకుండా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆమె మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని తాటి వెంకటేశ్వర్లు కోరారు. ఘటనకు ముందు, తర్వాత చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలించి, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని అన్నారు. మృతికి అసలు కారణం ఏంటన్నది స్పష్టంగా తేల్చి, దర్యాప్తులో ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగం కోసం స్వగ్రామానికి దూరంగా వెళ్లిన ఆదివాసి యువతి అనుమానాస్పదంగా మృతి చెందడం ఆందోళన కలిగించే విషయమన్నారు. మహిళలు పనిచేసే ప్రాంతాల్లో వారి భద్రతకు అవసరమైన రక్షణ చర్యలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. శిరీష కుటుంబం ప్రస్తుతం తీవ్ర విషాదంలో ఉందని, వారికి ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులకు తగిన న్యాయం, సహాయం అందేలా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తాటి వెంకటేశ్వర్లు కోరారు. శిరీష మృతికి సంబంధించిన ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.

## షానదుల్లా ఖాన్ నీ ఎన్కౌంటర్ చేయాలి

- **ఆదివాసి గిరిజన బిడ్డ  శిరీష కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు పోరాడుదాం**
- **GSS రాష్ట్ర యువజన నాయకులు అరేం ప్రశాంత్**
- **షానదుల్లా ఖాన్ నీ ఎన్కౌంటర్ చేయాలి**

**తాడ్వాయి డిడి9 వార్త**



మహేశ్వరం లోనియోజకవర్గం తుక్కుగూడ లోని ప్రైమ్ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో నర్సుగా ఉద్యోగం చేస్తున్నటువంటి అదివాసి గిరిజన బిడ్డ శిరీషను శానాద్ ఉల్లా ఖాన్ అనే వ్యక్తి మానభంగం చేసి చంపాడు పోలీసులు ఈ విషయాన్ని కప్పి పుచ్చడానికి శిరీష మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం పార్టీలకు కులాలకు, మతాలకు, అతీతంగా, ప్రతి ఒక్కరు స్పందించి ఆదివాసి సంఘాల నాయకులు ఉస్మానియా ఆసుపత్రికి చేరుకోవాలని విజ్ఞప్తి శిరీష కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు కలిసికట్టుగా పోరాడుదాం

శానాద్ ఉల్లా ఖాన్ నీ ఎన్కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం

## "పదవులు కాదు-ప్రజా పోరాటమే లక్ష్యం"

- **కార్మిక హక్కుల కోసం పోరాడిన యోధుడు గ్యానం సారయ్య..**
- **ఆయన ఆశయ సాధన కోసం ప్రజా పోరాటాలే ఘన నివాళి జి. నాగయ్య..**

**ఆగస్టు30 డిడి9 వార్త వెంకటాపురం.**

కార్మికులు, కర్షకులు, గిరిజనులు, గిరిజనేతరుల హక్కుల కోసం జీవితాంతం అలుపెరుగని పోరాటం చేసిన గ్యానం సారయ్య ఆశయ సాధన కోసం ప్రజా పోరాటాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. నాగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి శ్రీను అధ్యక్షతన గ్యానం సారయ్య 5వ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత సారయ్య చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి. నాగయ్య మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గంలోని వెంకటాపురం మండలంలో సీపీఐ(ఎం) పార్టీ ఎదుగుదలకు దశాబ్దాలుగా గ్యానం సారయ్య చేసిన కృషి మరువలేనిదన్నారు. తన నివాస గృహాన్నే పార్టీ కార్యాలయంగా మార్చుకుని, పేదల సమస్య ఏదైనా ముందుండి పోరాడిన నిస్వార్థ ప్రజా నాయకుడు సారయ్య అని కొనియాడారు. పార్టీ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఏనాడూ ఆశ పడలేదన్నారు. భూమి కోసం, పేదల గూడు కోసం పోరాడిన సారయ్యకు చివరికి సొంత ఇంటి స్థలం కూడా లేకపోవడం ఆయన నిస్వార్థ జీవితానికి నిదర్శనం అన్నారు. గ్యానం సారయ్య ఆశయాలను ముందుకు




తీసుకెళ్లేందుకు మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు నాగయ్య పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ పేదలు, కార్మికులు, కర్షకులు, గిరిజనులకు అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బి.రెడ్డి సాంబశివ, నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, గ్యానం వాసు, వంకా రాములు, చారి, కొప్పుల రఘుపతి, జజ్జరి దామోదర్, దేవయ్య, బచ్చల కృష్ణబాబు, యశోద, గుర్రం పుల్లారావు, సర్పంచ్ కొరసా నరసింహారావు, పర్షిక రాంబాబు, పండా శీను, కాపుల వెంకటేశ్వర్లు, రౌతు నరసింహారావు, సోలం రంగయ్య, హర్షిక కృష్ణ, తోట నాగేశ్వరరావు, కంఠం సత్యం, బోగట సాంబి, కోగిల మాణిక్యం, మేడం నగేష్, కురుసం మల్లయ్య, గుండమల్ల ప్రసాద్, మజ్జ సుహాసిని, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కుల సాధన కోసం సమరశంఖం..

- **సెప్టెంబర్ 7న ఏటూరునాగారానికి వేలాదిగా తరలిరావాలి..**
- **తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా. మైపతి అరుణ్ కుమార్.**

**మణుగూరు.ఆగస్టు 30 (డి డి 9వార్త)**

ఆదివాసీల హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ బద్ధమైన చట్టాల అమలు, ఉద్యోగాలు, భూమి హక్కులు, సాగునీరు, ఉపాధి అవకాశాల సాధన కోసం సెప్టెంబర్ 7న ఏటూరునాగారంలో నిర్వహించనున్న ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా. మైపతి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. తుడుందెబ్బ ఆధ్వర్యంలో పినపాక మండలంలోని జానంపేట, చేగరశల గ్రామాల్లో ఆదివాసీ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా. మైపతి అరుణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అలెం కోటి ముఖ్య అతిథులుగా హాజరై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ఆదివాసీల హక్కులు, భూములు, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన 5వ షెడ్యూల్ రక్షణ, PESA చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఐటీడీఏ పరిధిలోనే ఉద్యోగ నియామకాలు, ప్రమోషన్లు, బదిలీలకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. పోడు సాగు చేస్తున్న అర్హులైన ఆదివాసీ రైతులకు హక్కు పత్రాలు అందించాలని, గిరివికాస్ పథకం ద్వారా బోర్లు మంజూరు చేయాలని, గోదావరి జలాలను ఆదివాసీ ప్రాంత రైతులకు సాగునీటి కోసం వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. BTPS, KTPS, BPL, సింగరేణి తదితర సంస్థల్లో ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



కల్పించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఐటీడీఏ కేంద్రాల వద్ద దశలవారీగా ఆదివాసీ మార్చ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు.

**ఆదివాసీ మార్చ్ కార్యక్రమాలు**

- **సెప్టెంబర్ 7 – ఏటూరునాగారం**
- **సెప్టెంబర్ 16 – ఉట్నూర్**
- **సెప్టెంబర్ 21 – భద్రాచలం**
- **సెప్టెంబర్ 28 – మన్ననూరు**

ఆదివాసీల సమస్యలు కేవలం ఒక గ్రామానికి సంబంధించినవి కావు... ఇవి మన భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలు. మన హక్కులను కాపాడుకోవాలంటే ఆదివాసీ సమాజం ఐక్యంగా ఉద్యమించాలి. కొమురం భీమ్ స్ఫూర్తితో రాజ్యాంగబద్ధమైన మార్గంలో మన హక్కుల సాధన కోసం ముందుకు సాగాలి అని డా. మైపతి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పోలేబోయిన వెంకటనారాయణమాట్లాడుతూ పినపాక, కరకగూడెం తదితర మండలాల నుంచి ఆదివాసీ ప్రజలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో సెప్టెంబర్ 7న ఏటూరునాగారానికి తరలివచ్చి ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అలెం కోటి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ, పినపాక మండల అధ్యక్షులు కబ్బాక రమేష్, తుడుందెబ్బ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీ యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్నగండిలో వరుస మృతులు.. అధికారుల నిర్లక్ష్యమే కారణం

**మహమ్మద్ యాకుబ్ పాషా**

**జనగామ*, ఆగస్టు 30(డిడి 9వార్త)బ్యూరో**

చిల్పూరు మండలం గార్లగడ్డ తండా గ్రామపంచాయతీ పరిధిలోని మల్లన్నగండి రిజర్వాయర్‌లో వరుసగా ఇద్దరు యువకులు నీటిలో మునిగి మృతి చెందడం అత్యంత విషాదకరమని బీఆర్ఎస్ నాయకులు, హం సాత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మహమ్మద్ యాకుబ్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్నగండికి రోజురోజుకూ సందర్శకుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించి, ప్రమాదకర ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణతో పాటు భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాదకర ప్రాంతాలను డేంజర్ జోన్లుగా ప్రకటించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆగస్టు 21న దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మహమ్మద్ నజీర్, ఆగస్టు 29న బసన్నపేటకు చెందిన భాస్కర్ ఇదే ప్రాంతంలో నీటిలో మునిగి మృతి చెందడం బాధాకరమన్నారు. మొదటి ఘటన జరిగిన వెంటనే అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకుని ఉంటే రెండో ఘటనను నివారించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. వరుస ప్రమాదాలపై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి, మృతులైన నజీర్, భాస్కర్ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆర్థిక భరోసా కల్పించాలని మహమ్మద్ యాకుబ్ పాషా డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి మల్లన్నగండిలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.

## ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసా? మాఫియా అడ్డానా!

- **ఉద్యోగాల పేరుతో కోట్ల రూపాయలు వసూళ్లు చేసిన ఎమ్మెల్యే పీఏ**
- **పీఏ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి**
- **అవినీతి ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలి.**
- **జీసీసీ భూమితో పాటు ప్రభుత్వ భూములను కాపాడాలి**
- **బీఆర్ఎస్  నియోజకవర్గ ఇన్ చార్జి రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (డిడి9 వార్త)**

నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మాఫియా ఆగడాలకు అడ్డాగా మారిందని, ఎమ్మెల్యే అనుచరులుగా ఉంటూ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును అడ్డాగా చేసుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్ చార్జి రావులపల్లి రాంప్రసాద్ , నాయకుడు మానే రామకృష్ణ ఆరోపించారు. ఆదివారం భద్రాచలంలోని హరిత హోటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు



మాట్లాడారు. ఇసుక వ్యవహారంలో ఒకరు, భారీ అప్పులతో పరారైన వ్యక్తి ఒకరు, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే పీఏ కల్యాణ్ ఇలా వివిధ వివాదాల్లో ఉన్న వ్యక్తులంతా ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. వీరి వ్యవహారాలపై ఎమ్మెల్యే ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. భద్రాచలంలో కొత్తగా మాఫియా వ్యవస్థ రూపుదిద్దుకుంటోందని, దానికి రాజకీయ అండ ఉందా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. కోట్ల రూపాయలు వసూలు చేసిన ఎమ్మెలే పీఏ కల్యాణ్ ఓ మంత్రి అండతోనే లొంగిపోయాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భద్రాచలం నియోజకవర్గంలో పని చేసిన ఏ ఎమ్మెల్యే హయాంలో జరగని అవినీతి ప్రస్తుతం భద్రాచలంలోనే జరుగుతుందని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పేరుతో బీఆర్ఎస్ తరపున గెలిచిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం కాంగ్రెస్ పార్టీలో చేరి భారీగా ఆస్తులను కూడబెట్టుకుంటున్నారే తప్ప అభివృద్ధి ఎక్కడ జరగలేదన్నారు. ఇందుకు నిదర్శనమే భద్రాచలం– వెంకటాపురం ప్రధాన రహదారి దుస్థితేనని ఆరోపించారు. భద్రాచలం నడిబొడ్డున ఉన్న జీసీసీ భూమిని కాంగ్రెస్ కార్యకర్త ఆక్రమిస్తున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేకు లేదా అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేసే ఏ వ్యవహారాన్నీ బీఆర్ ఎస్ పార్టీ సహించబోదని, బాధితులకు అండగా నిలిచి అవినీతికి వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ ఎస్ నాయకులు హెచ్చరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి భారీగా నగదు వసూలు చేసిన ఎమ్మెల్యే పీఏ కల్యాణ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు నగదును తిరిగి ఇప్పించాలని ఉద్యోగంపై ఆశతో అప్పులు చేసి మరీ నగదు చెల్లించిన పలువురు యువత తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై బాధితుల నుంచి పూర్తి వివరాలను సేకరించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ ఎస్ అండగా ఉంటుందని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దొడ్డి తాతారావు, కణితి రాముడు, అయినవోలు పవన్‌కుమార్, కాకి అనిల్‌కుమార్, యువరాజు పాల్గొన్నారు.

# భద్రాచలంలో రాజకీయ వేడి. బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ కౌంటర్

- ఎమ్మెల్యేపై నోరు జారితే ఊరుకునేది లేదు
- ఖబడ్దార్ అంటూ బిఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ నేతలు హెచ్చరిక
- ఆరోపణలకు ఆధారాలున్నాయా..? కాంగ్రెస్ సూటి ప్రశ్న.
- అభివృద్ధి నీ చూసి ఓర్వలేక ప్రజల మద్దతున్న ఎమ్మెల్యేపై విమర్శలా
- సర్పంచ్ పూనం కృష్ణ, తెలంగాణ రాష్ట్ర పెరిక కార్పొరేషన్ డెవలప్‌మెంట్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్

**భద్రాచలం, ఆగస్టు 30 ( డిడి9 వార్త )**



భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణ, తెలంగాణ రాష్ట్ర పెరిక కార్పొరేషన్ డెవలప్‌మెంట్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్సీ సెల్ చైర్మన్ చింతీరాల రవికుమార్ అన్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని వ్యక్తులను పార్టీతో ముడిపెట్టి విమర్శలు చేయడం సరికాదన్నారు. నవాబుకు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని, పార్టీకి నచ్చని కారణంగానే అతడిని తొలగించామని తెలిపారు. భరత్‌కు కూడా కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేకు సీసీగా కళ్యాణ్‌ను నియమించింది బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు కాదా? అని వారు ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ పార్టీపై, ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం తగదన్నారు. పంచాయతీ ఎన్నికల్లో 20 వార్డుల్లో ఒక్క వార్డుకే పరిమితమైన వారు ప్రజల మద్దతుతో ఎన్నికైన ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో భద్రాచలం అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వని వారు.. ప్రస్తుతం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతుంటే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భద్రాచలంలో గతంలో జరిగిన సెటిల్మెంట్లు, దందాలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను ప్రజలు శుభకార్యాలకు ఆహ్వానించడం భారతీయ సంస్కృతిలో సహజమైన విషయమని, దానిని కూడా రాజకీయ కోణంలో చూడటం సరికాదన్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చే ఆరోపణలను మీడియా ముందు ప్రస్తావించడం కంటే భద్రాచలం నియోజకవర్గ ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీపై, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుపై ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన సమాధానం చెబుతారని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

# 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- ఆదివాసి చట్టాల జోలికొస్తే ఉద్యమం తప్పదు"
- చందా లింగయ్య, కేచెల రంగారెడ్డి

**భద్రాచలం, ఆగస్టు 30 (డిడి9 వార్త )**



రాజ్యాంగం కల్పించిన ఫిఫ్త్ షెడ్యూల్‌ను రక్షించి, ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఆదివాసి చట్టాల పరిరక్షణ కమిటీ నాయకులు డాక్టర్ చందా లింగయ్య మరియు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెచ్చేల రంగారెడ్డి డిమాండ్ చేశారు. భద్రాచలంలోని గిరిజన భవన్‌లో ఆదివాసి అభ్యుదయ సంఘం అడ్వైజర్ పూనం వీరభద్రం అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలోని ఏజెన్సీ చట్టాలను నిర్వీర్యం చేయడానికి కొంతమంది బడాబాబులు, పెత్తందార్లు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ 1/70 చట్టాన్ని నీరుగార్చేందుకు జీవో నెంబర్ 120 తెచ్చినప్పటికీ, ఆదివాసుల ఐక్యతతో పోరాడి కాపాడుకున్నామని గుర్తుచేశారు. ఏజెన్సీ చట్టాలను అమలు చేయకుండా అడ్డుకునే ప్రయత్నాలను, హైకోర్టును ఆశ్రయించే తీరును వెంటనే మానుకోవాలని హెచ్చరించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆదివాసి చట్టాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలుంటాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వజ్జా నరసింహారావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు గుగ్గల రామకృష్ణ, భద్రాచలం ఉపాధ్యక్షులు కొరస చినబాబు దొర, మరణం చిట్టిబాబు, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ నాయకులు దాసరి సాయన్న, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్, డివిజన్ అధ్యక్షులు దండగల రామ్ చరణ్, నాయకులు కనుక ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# యస్జీటీ ఉపాధ్యాయులపై మానసిక వేధింపులు ఆపాలి

**యస్ఏ-1, యస్ఏ-2 పరీక్షల బాహ్య మూల్యాంకన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి**

**బాన్సువాడ, ఆగస్టు 30(డిడి9 వార్త):**



యస్జీటీ ఉపాధ్యాయులపై అదనపు పని భారం మోపుతూ మానసిక ఒత్తిడికి గురిచేసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని యస్జీటీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యాల సంతోష్ డిమాండ్ చేశారు.ఆదివారం బాన్సువాడ పట్టణంలో యస్జీటీ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యాల సంతోష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన విద్యా సంస్కరణల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించే యస్ఏ-1, యస్ఏ-2 పరీక్షలకు బాహ్య మూల్యాంకనం చేపట్టే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.ఒకటి లేదా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్న ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యమైన విద్యను ఎలా అందించగలమని ప్రశ్నించారు.ఇప్పటికే తక్కువ మంది ఉపాధ్యాయులతో బహుళ తరగతులు, బహుళ విషయాల బోధన, ఎఫ్ఎల్ఎన్ అమలు, బోధనేతర పనులు నిర్వహిస్తూ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మరింత పని భారం పెంచుతూ, ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు.ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న యస్జీటీ ఉపాధ్యాయులపై అదనపు భారం మోపే నిర్ణయాలను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, అలాగే బోధనేతర పనుల కోసం ఐదు, ఆరు పాఠశాలలకు కలిపి ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని కోరారు.ఉపాధ్యాయులకు అవసరమైన సౌకర్యాలు కల్పించిన అనంతరం ప్రభుత్వం ఎలాంటి విద్యా విధానం తీసుకొచ్చినా యస్జీటీ ఉపాధ్యాయులంతా స్వాగతిస్తారని అన్నారు.అలాగే యస్ఏ-1, యస్ఏ-2 పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను నిలిపివేయాలని, హైస్కూళ్లలో పనిచేస్తున్న యస్జీటీ ఉపాధ్యాయులను తక్షణమే ప్రాథమిక పాఠశాలలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యస్జీటీ నాయకులు శ్రీకాంత్, పండరి, ప్రవీణ్ కుమార్, నిఖిల్ కుమార్, శ్రీనివాస్, అనిల్, లక్క సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడల దినోత్సవం

**బోనకల్,ఆగస్టు 29, (డీడీ9 వార్త):**



స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ నళిని శ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేజర్ ధ్యాన్ చంద్ గచిత్రపటానికి పూలమాలతో ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమాదేశిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ నళిని శ్రీ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ భారత దేశ హాకీ చేతులను కాకుండా ప్రపంచ హాకీ చరిత్రలో కూడా అత్యంత గొప్ప క్రీడాకారుల్లో ఒకరు.ప్రేమతో హాకీ మాంత్రికుడు అని పిలుస్తారు. ఆయన అసలు పేరు ధ్యాన్ సింగ్ ఆగస్టు 29 1905లో ఉత్తరప్రదేశ్లో జన్మించారు. వాళ్ళ నాన్నగారు సమేశ్వర్ సింగ్ బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో పనిచేసేవారు. ధ్యాన్ చంద్ చిన్నతనంలోనే క్రీడలపై ఆసక్తి పెంచుకున్నారు, తర్వాత భారత సైన్యంలో చేరి హాకీ ఆడడం ప్రారంభించారు ఆయన ఎక్కువగా రాత్రి సమయంలో సాధన చేసేవారని చెబుతారు చంద్రుని వెలుతురులో కూడా సాధన చేయడం వల్ల ఆయనకు చంద్ అనే బిరుదు వచ్చింది. ధ్యాన్ చంద్ భారత హాకీ జట్టుకు ప్రాతినిధ్యం వహించి మూడు ఒలంపిక్స్ బంగారు పథకాలు సాధించారు అవి 1928,1932,1936 సంవత్సరాలలో సాధించారు బెర్లిన్ ఒలంపిక్స్ లో భారత హాకీ జట్టు అత్యంత అద్భుతంగా ఆడి ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ఖ్యాతిని పెంచింది. ధ్యాన్ చంద్ హాకీ స్టిక్ తో బంతిని అద్భుతంగా నియంత్రించేవారు ఆయన డ్రిబ్లింగ్ వేగం గోల్స్ చేయగల సామర్థ్యం చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోయేవారు అందుకే ఆయనను హాకీ విజార్డ్ అని ప్రపంచం గౌరవించింది. హాకీ క్రీడలో భారతదేశానికి చేసిన విశేష సేవలతో పాటు ఆయన భారత సైన్యంలో కూడా సేవలందించారు,తర్వాత ఆయనకు మేజర్ హోదా లభించింది. 1956 సం లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ పురస్కారం అందించింది. భారత ప్రభుత్వం ఆగస్టు 29 మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని జాతీయ క్రీడల దినోత్సవంగా ప్రకటించింది. మేజర్ ధ్యాన్ చంద్ 3 డిసెంబర్ 1979 లో మరణించారు. ప్రతిభ ఒక్కటే విజయాన్ని ఇవ్వదు, క్రమశిక్షణ ,నిరంతర సాధన, దేశభక్తి కలిసినప్పుడు గొప్ప విజయాలు సాధించవచ్చు అనే సందేశాన్ని మేజర్ ధ్యాన్ చంద్ జీవిత చరిత్ర ద్వారా ప్రతి విద్యార్థి స్ఫూర్తిని పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ అంతోటి తిరుపతిరావు అధ్యాపకులు జోనతాన్ బాబు,రాజేంద్ర కుమార్,లక్ష్మీకాంతం, పద్మావతి,రామకృష్ణ,రమేష్, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ,యశోద,శాంతి ప్రియ,లైబ్రరీన్ మోహన్, యుడీసి మదర్ సాహెబ్, జశ్వంత్,అరుణ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రజలకు బీసీఆర్ ట్రస్ట్ సేవలందిస్తున్న తీరు అభినందనీయం

**ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**




**భద్రాచలం, ఆగస్టు 30 (డిడి9 వార్త)**

ఏజెన్సీ ప్రాంత ప్రజలకు బీసీఆర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. బండారు చందర్‌రావు పేరుతో ఏర్పాటైన బీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కరోనా విపత్కర సమయంలో 75 రోజులపాటు ఐసోలేషన్ సెంటర్‌ను నిర్వహించి బాధితులకు ట్రస్ట్ అండగా నిలిచిందని కొనియాడారు. ప్రతి నెలా బీపీ, షుగర్ బాధితులకు కేవలం రూ.30కే వైద్య పరీక్షలు నిర్వహించి, రూ.100కే నెలకు సరిపడా మందులు అందజేయడం అభినందనీయమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. అమరవీరుల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు తెలిపారు. భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణదొర మాట్లాడుతూ ట్రస్ట్ సేవలకు గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహకారం ఉంటుందని హామీనిచ్చారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ పవన్ కుమార్ తదితర వైద్యులు సేవలందించగా, సుమారు 150 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి సోమశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, సీపీఐ(ఎం) నాయకులు, మారుతి పారామెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సామరస్యంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి ఎస్సై వికే రాములు



**బాన్సువాడ, ఆగస్టు 30(డిడి9 వార్త):**

గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో, సామరస్యంగా నిర్వహించాలని బీర్కూర్ ఎస్సై వికే రాములు అన్నారు.ఆదివారం బీర్కూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గణేష్ మండపాల నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై వికే రాములు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు పాటించాలని, నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండపాల నిర్వాహకులు పరస్పర సహకారంతో, అన్ని వర్గాల ప్రజల మనోభావాలను గౌరవిస్తూ గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్సై సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాల గణేష్ మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా జాదవ్ ప్రవీణ్ నాయక్

**రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక**



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 30(డిడి9 వార్త):**

గిరిజన విద్యార్థి సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా జాదవ్ ప్రవీణ్ నాయక్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో నూతన జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొర్ర బంతిలాల్ నాయక్, ఉపాధ్యక్షుడిగా బర్మావత్ నరేష్ నాయక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ... గిరిజన విద్యార్థుల హక్కుల సాధన, బంజారాల అభ్యున్నతి కోసం సంఘం ఎల్లప్పుడూ పోరాడుతుందని తెలిపారు. గిరిజన వికాసానికి నాయకులంతా సమన్వయంతో, కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధారావత్ గణేష్ నాయక్, జాతీయ అధ్యక్షుడు వెంకట్ బంజారా, జాతీయ నాయకుడు ఇందల్ రాథోడ్, రాష్ట్ర అధ్యక్షుడు మూడ్ బాలాజీ నాయక్, నాయకులు రవీందర్ నాయక్, రమేష్ నాయక్, రాజ్‌కుమార్ నాయక్, బాలాజీ నాయక్, శీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి మృతి

### - ఆచూకీ తెలిస్తే సమాచారమివ్వాలని పోలీసుల విజ్ఞప్తి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 30(డిడి9 వార్త):**



బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ చౌరస్తా వద్ద యాచిస్తూ అపస్మారక స్థితిలో పడి ఉన్న ఒక గుర్తు తెలియని వ్యక్తి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బోధన్ ఎస్హెచ్ఓ వెంకట నారాయణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు కలిగిన సదరు వ్యక్తి ఈ నెల 21న శక్కర్ నగర్ చౌరస్తా వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండగా బోధన్ కానిస్టేబుళ్లు గమనించి వెంటనే బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం చనిపోయారు. మృతదేహాన్ని ప్రస్తుతం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుని వివరాలు గానీ, బంధువుల సమాచారం గానీ తెలిసిన వారు బోధన్ పోలీసులను 8712659778, 8712650870 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఎస్సై రాజశేఖర్



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 30(డిడి9 వార్త):**

మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలోని బైపాస్ చౌరస్తా వద్ద ఆయన ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రీత్ ఎనలైజర్లతో వాహనదారులను తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. రహదారి ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, జైలు శిక్షతో పాటు లైసెన్సులు కూడా రద్దు చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రియాజ్, రామకృష్ణ పాల్గొన్నారు.

## అమ్మో పులి

### దూడ పై పెద్దపులి దాడి



**అదిలాబాద్ జిల్లా, సోనాల మండలం, డిడి 9 వార్తా:-**

సోనాల మండలంలోని దేవులనాయక్ తండా గ్రామానికి చెందిన ఆడే కిషోర్ దూడపై పెద్దపులి దాడి చేయడంతో దూడ మృతి చెందింది. రోజువారీగా ఆవు మందలో వెళ్లగా. శనివారం ఆవుల మందపై ఒకేసారి పులి దాడి చేసి దూడను పట్టుకుని అడవిలోకి తీసుకువెళుతుండగా పశువుల కాపరులు కేకలు వేయడంతో వదిలిపెట్టి వెళ్లిందన్నారు. బాధిత రైతు ఫారెస్ట్ వారికి తెలియచేశారు బోథ్ ఇంచార్జి ఎఫ్ ఆర్ ఓ కవిత సంఘటన స్థలానికి చేరుకుని పెద్దపులి దాడి చేసిన దూడను పరి శీలించారు. దూడ నష్టపరిహారం అంచనా విలువ అధికారులకు పంపించి నష్టప రిహారం అందించే విధంగా చూడాలని అన్నారు.

**అడవిలో ఒంటరిగా**

దేవులనాయక్ తండా, ఆజ్జర్ పజ్జర్ అడవుల్లో, వ్యవసాయ పొలాల్లో ఒంటరిగా సంచరించవద్దని ఎఫ్ ఆర్ ఓ కవిత గారు గ్రామస్తులకు, రైతులకు సూచించారు. అడవి సమీపంలో పశువులు సంచరించడంతో వ్యవసాయ పొలానికి వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకుని వెళ్లాలని అటవీ శాఖ అదికారులు సూచించారు.

## ఎడపల్లి మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా బర్ధిపూర్ నర్సయ్య

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 30(డిడి9 వార్త):**



ఎడపల్లి మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా బర్ధిపూర్ నర్సయ్య ఎన్నికయ్యారు. ఎడపల్లిలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆరు తర్పల 194 మంది ప్రతినిధులు, గ్రామ పెద్దల సమక్షంలో ఈ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు కొనసాగుతుందని, ప్రతి మూడు నెలలకొ కసారి జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని నిర్వాహకులు తీర్మానించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శులుగా శిరిశెట్టి సంతోష్, కంజరి అభినవ్, కోశాధి కారిగా ఆకుల సంతోష్, ఉపాధ్యక్షులుగా కట్కం సుధాకర్, కల సంతోష్, బర్ధిపూర్ అశోక్, సహాయ కార్యదర్శులుగా కంజరి ఓంప్రకాష్, న్యావనంది శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా శివ చైతన్య ఎన్నికయ్యారు. సలహాదారులుగా నాయిడి పోతన్న, ఆకుల శ్రీనివాస్, బొబ్బిలి శ్రీనివాస్, భుజంగం లింగం, బర్ధిపూర్ విటల్, కట్కం అరుణ్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బిఎల్వోగా ఎస్సార్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసిన బి.వీణతో పాటు సంఘంలో వంటలు చేసి సహకరించిన కట్కం అబ్బన్న, కట్కం కోవేట్ శంకర్, చెరుకు నారాయణ, కొప్పుల శంకర్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కుల పెద్దలు కల రాజేశ్వర్, కల శ్రీనివాస్, కల శంకర్, న్యావనంది గంగాధర్, కంజరి రామకృష్ణ, దూస గంగాధర్, బోధన్ శ్రీనివాస్, మహిళా ప్రతినిధులు ఆదేవ్వ, భూమవ్వ, లక్షి , లావణ్య, రేఖ, నర్సవ్వ, యువకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కౌన్సిలర్లు కృషి చేయాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 30(డిడి9 వార్త):**



మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి భాజపా కౌన్సిలర్లు సమర్థంగా పోరాడాలని ఆ పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షుడు పసులోటి గోపికిషన్ పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన భాజపా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొలిపాక రేణుక బాలరాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రాజులదేవి లక్ష్మీ పూజిత పవన్ కుమార్, ఫ్లోర్ సెక్రటరీ గుంత అబ్బవ్వ గంగాధర్‌లను పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఒకరి కొకరు మిఠాయిలు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా గోపికిషన్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి, వార్డుల్లో మౌలిక వసతుల కల్పనపై కౌన్సిల్ సమావేశాల్లో గళమెత్తాలని సూచించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాసిని వినోద్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మీర్జాపూర్ అరవింద్, సీనియర్ నాయకులు హన్మండ్లు చారి, పప్పుల వేణు, పెరక వెంకటేష్, బిజెవైఎం పట్టణ అధ్యక్షుడు ఏనుగంటి గౌతమ్ గౌడ్, పార్టీ నాయకులు కలిగోట కృష్ణ, గడ్డం శ్రీనివాస్, వినయ్, చరణ్, కన్నె శ్రీనివాస్, హరి, అనిల్, రవి కుమార్, కస్ప లింగం తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో పశువుల కొట్టం దగ్ధం

**ఆదిలాబాద్ జిల్లా, సోనాల మండలం , డిడి 9 వార్తా:-**



సోనాల మండల పరిధిలోని పూల్సింగ్ నాయక్ తండాలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో పశువుల కొట్టంలో అగ్నిప్రమాదం జరిగి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు కొట్టం మొత్తం వ్యాపించడంతో అందులో ఉన్న పశువుల మేతతో పాటు విలువైన వ్యవసాయ సామగ్రి పూర్తిగా బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో వ్యవసాయానికి వినియోగించే విద్యుత్ మోటార్, వైర్లు, పైపులు, స్ప్రింక్లర్ సెట్, వ్యవసాయ పనిముట్లతో పాటు నిల్వ ఉన్న యూరియా, డీఏపీ ఎరువుల సంచులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కొంతమంది సామగ్రి అంతా కాలిపోవడంతో బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కాగా, ప్రమాదం జరగడానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియ రాలేదు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు నష్ట తీవ్రతను అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

## ఆగస్టు 31న జరిగే మాలల సెక్రటేరియట్ ముట్టడి జయప్రదం చేయండి

### నీలం నరేందర్ మాల మహానాడు.

**వలిగొండ ఆగస్టు 30**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆగస్టు 31 న జరిగే మాల మహానాడు చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి మాలలు అందరూ ప్రతి ఇంటికి తాళం వేసి మాల సత్తయ్యేందో చూపడానికి సెక్రటరీ ముట్టడిని జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా నాయకులు నీలం నరేందర్ కోరారు. మాలలకు జరిగిన అన్యాయాన్ని ఎదుర్కోవాలంటే మాలల సత్త ఏందో చూపడానికి రేపు జరగబోయే ముట్టడికి మనమందరం ఏకంగా పోరాడి మాల సత్తా చూపియాలంటే రేవంత్ రెడ్డికి అర్థం కావాలి మాలల మజాకా అని తెలుసుకోవాలి. అని ఆయన గుర్తు చేశారు. రాబోయే ఎలక్షన్లో మాలల సత్తా చూపియాలని మాలలను కోరారు.




## సెప్టెంబర్ 2న మున్సిపల్ కార్మికుల పట్టణ మహాసభను జయప్రదం చేయాలి

- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు వల్లపు దాసు సాయికుమార్ పిలుపునిచ్చారు.
- మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని.
- పెండింగ్‌లో ఉన్న వేతనాలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని
- కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు.

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30 :**

సెప్టెంబర్ 2న మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగే మున్సిపల్ కార్మికుల పట్టణ మహాసభను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు వల్లపు దాసు సాయికుమార్ పిలుపునిచ్చారు. సూర్యాపేటలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు పట్టణ ప్రజలకు నిరంతరం పారిశుద్ధ్య సేవలు అందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు, యూనిఫాం, సౌకర్యాలు కల్పించడంతో పాటు పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల




సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించేందుకు సెప్టెంబర్ 2న జరిగే పట్టణ మహాసభ కీలకంగా నిలుస్తుందని తెలిపారు. మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చాగంటి వెంకటరమణ, బాలెన్లబాబు, బొజ్జ బాలకృష్ణ, జానపాటి యాదగిరి, రాము, బండారు మమత తదితరులు పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518